


ప్రభాత సూర్య
PRABHATA SURYA
తెలుగు దిన పత్రిక
www.suryaa.news

హైదరాబాద్
8-5-2026
వెల: రూ.5/-
పేజీలు: 8
సంపుటి: 09
సంచిక: 239

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD

# అధికారం దక్కలేదనే కేటీఆర్ ఆక్రోశం

### ప్రజలు అసహ్యించుకునేలా ఆయన వ్యాఖ్యలు

### రైతు పేరుతో రాజకీయ డ్రామా..బీఆర్ఎస్ అసలు రంగు బయటపడింది

### రైతు సంగ్రామ సదస్సు కాదు... బీఆర్ఎస్ ఆక్రోశ సభ: మంత్రి పొంగులేటి

హైదరాబాద్: భవిష్యత్‌లో కూడా అధికారం దక్కదనే భయంతోనే కేటీఆర్ తీవ్ర నిరాశ, అసహనంలో తెలంగాణ ప్రజానీకం అసహ్యించుకునేలా నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మండిపడ్డారు. పదేళ్లపాటు అధికారంలో ఉన్నప్పుడు రైతు సంక్షేమాన్ని విస్మరించి, ఇప్పుడు రాజకీయ మైలేజీ కోసం మాటల దాడులకు దిగడం వారి నిస్సహాయతకు నిదర్శనమని మంత్రి విమర్శించారు. వరంగల్‌లో కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు రైతు సంక్షేమంపై చింత కాదు..పూర్తిగా రాజకీయ నిరాశ, ఆక్రోశానికి ప్రతిబింబమని ఘాటుగా వ్యాఖ్యానించారు. కేంద్రంలోని బీజేపీతో కుమ్మక్కై, వారిపై ఈగ వాలనివ్వకుండా కాపాడుతూం అన్నింటికీ రాష్ట్ర ప్రభుత్వాన్ని దోషిగా నిలబెట్టే ప్రయత్నం..బీఆర్ఎస్ అసలు రాజకీయ స్వరూపాన్ని బయటపెడుతోందని బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో మండిపడ్డారు. వరంగల్‌లో నిర్వహించిన సభ రైతు సంగ్రామ సదస్సుగా చెప్పడం పూర్తిగా అసత్యమని, అది బీఆర్ఎస్ ఆక్రోశ సభ మాత్రమేనని మంత్రి స్పష్టం చేశారు. ఆ సమావేశానికి రైతులు రాలేదని కేవలం పార్టీ కార్యకర్తలే హాజరయ్యారని విమర్శించారు.



2లో



## కరీంనగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై దాడి..

- స్పందించిన బండి సంజయ్
- బీఆర్ఎస్ నాయకులు మితిమీరిన అహంకారంతో ప్రవర్తిస్తున్నారని ఆగ్రహం
- తమ కార్యకర్తల సహనం పరీక్షించవద్దన్న బండి సంజయ్
- దాడులు, దౌర్జన్యాలు తమ సంస్కృతి కాదన్న బండి సంజయ్

కరీంనగర్‌లో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం మీద జరిగిన దాడి ఘటనపై కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్ స్పందించారు. బీఆర్ఎస్ నాయకులు మితిమీరిన అహంకారంతో ప్రవర్తిస్తున్నారని, తమ కార్యకర్తలకు కూడా సహనం ఉంటుందని, కానీ ఆ సహనాన్ని పిరికితనంగా భావించవద్దని హెచ్చరించారు. కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

## ఏపీలో వాహన రిజిస్ట్రేషన్ ఇక 24 గంటల్లోనే..

- ఆలస్యమైతే ఆటో అప్రూవల్!
- రిజిస్ట్రేషన్ల జాప్యంపై చంద్రబాబు ఆదేశాలతో కొత్త విధానం
- ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న 27 వేల రిజిస్ట్రేషన్లు
- త్వరలో ప్రభుత్వ ఆమోదంతో అమల్లోకి రానున్న కొత్త రూల్



2లో

## బెంగాల్ అసెంబ్లీని రద్దు చేసిన గవర్నర్..

- ఎల్లుండి కొలువుదీరనున్న బీజేపీ ప్రభుత్వం!
- పశ్చిమ బెంగాల్ శాసనసభను రద్దు చేసిన గవర్నర్ ఆర్.ఎన్. రవి
- ముగిసిన ముఖ్యమంత్రిగా మమతా బెనర్జీ పదవీకాలం

2లో



# విజయ్‌కు మళ్లీ గవర్నర్ మొండిచేయి..

- కలిసి వచ్చే పార్టీల వేటలో బీజీగా మారిన టీవీకే చీఫ్
- డీఎంకే, అన్నాడీఎంకే జట్టుకడితే మూకుమ్మడి
- రాజీనామాలు చేసేందుకు రెడీగా ఉన్న టీవీకే ఎమ్మెల్యేలు !
- అవసరమైతే న్యాయపోరాటానికీ సిద్ధమని వ్యాఖ్య
- నూతన ప్రభుత్వ ఏర్పాటుపై తమిళనాట కొనసాగుతున్న ప్రతిష్టంభన
- రాజ్యసభ స్థానానికి అన్నాడీఎంకే నేత షణ్ముగం రాజీనామా
- అన్నాడీఎంకేను చీల్చి టీవీకేతో షణ్ముగం కలుస్తారని ఊహాగానాలు

చెన్నై: తొలి సినిమాతోనే బ్లాక్‌బస్టర్ హిట్ కొట్టినట్లు తమ మొదటి ఎన్నికల్లోనే అత్యధిక స్థానాల్లో గెలిచి దాదాపు అధికారతీరాలకు చేరిన టీవీకే గంటలు గడుస్తున్నా ప్రభుత్వ ఏర్పాటు గండాన్ని దాటలేక అవస్థలు పడుతోంది. మ్యాజిక్ ఫిగర్ సాధించాకే తన వద్దకు రావాలని ఓవైపు గవర్నర్ అర్లేకర్ స్పష్టంచేయడం, మరోవైపు పదవీయోగం దక్కకుండా చేసేందుకు ద్రవిడ దిగ్గజ పార్టీలు డీఎంకే, అన్నాడీఎంకే కలిసి పనిచేయనున్నాయనే వార్తల నడుమ టీవీకే చీఫ్ విజయ్ వేగంగా పావులు కదుపుతున్నారు. తమ ప్రియతమ హీరో, నేతను ముఖ్యమంత్రికాకుండా అడ్డుతగిలితే మూకుమ్మడి రాజీనామాలు చేసేందుకూ

# పిఠాపురం టీడీపీలో అనూహ్య పరిణామం..

- బాధ్యతల నుంచి వర్మ తొలగింపు.. మీడియా ముందు కన్నీళ్లు
- పిఠాపురం టీడీపీ ఇంఛార్జ్ బాధ్యతల నుంచి మాజీ ఎమ్మెల్యే వర్మ తొలగింపు
- నియోజకవర్గ పార్టీ వ్యవహారాల కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటుకు అధిష్ఠానం కసరత్తు
- మీడియా సమావేశంలో భావోద్వేగానికి లోనై కన్నీటి పర్యంతమైన వర్మ
- కూటమిలో ఇబ్బందులు రాకుండా తానే కమిటీని కోరానని వర్మ వెల్లడి
- అధిష్ఠానం ఏ నిర్ణయం తీసుకున్నా కట్టుబడి ఉంటానని స్పష్టీకరణ



పిఠాపురం నియోజకవర్గంలో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. నియోజకవర్గ టీడీపీ ఇంఛార్జ్‌గా వ్యవహరిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మను ఆ బాధ్యతల నుంచి అధిష్ఠానం తప్పించింది. ఈ నిర్ణయం స్థానిక రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పార్టీ వ్యవహారాలను పర్యవేక్షించేందుకు త్వరలోనే ఒక ప్రత్యేక కమిటీని నియమించనున్నట్లు తెలుస్తోంది. ఈ కమిటీ ఏర్పాటుపై టీడీపీ అధిష్ఠానం కసరత్తు ప్రారంభించింది. ఈ నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే వర్మ పిఠాపురంలోని పార్టీ కార్యకర్తలతో సమావేశమయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఆయన తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. తనను ఇంఛార్జ్ బాధ్యతల నుంచి తప్పించడంపై స్పందిస్తూ,



2లో

## రేవంత్ రెడ్డికి కనీస కనికరం లేదు హరీశ్ రావు ఆగ్రహం

### వడ్ల కుప్పల వద్ద రైతుల గుండెలు ఆగిపోతున్నాయని ఆవేదన

### నెల రోజులుగా వడ్లను కొనుగోలు చేయడం లేదని విమర్శ

### తరుగు పేరుతో రైతులను దోచుకుంటున్నారని ఆరోపణ

## తమిళనాడు రాజకీయాలపై డీకే శివకుమార్ హాట్ కామెంట్స్

- తమిళనాడు గవర్నర్ తీరుపై కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ విమర్శలు
- నటుడు విజయ్ పార్టీకి ప్రభుత్వం ఏర్పాటు చేసే అవకాశం ఇవ్వకపోవడం సరికాదు
- గతంలో యడియూరప్ప, వాజ్‌పేయిలకు ఇలాగే అవకాశం ఇచ్చారని గుర్తు చేసిన డీకే
- మెజారిటీ నిరూపించుకునే అవకాశం ఇవ్వకుండా అడ్డుకోవడం అప్రజాస్వామికం

2లో

## ఏపీకి రాయల్ ఎన్‌ఫీల్డ్.. రూ. 2,200 కోట్ల భారీ పెట్టుబడి

- ఏపీకి వచ్చిన ప్రముఖ మోటార్‌సైకిల్ సంస్థ రాయల్ ఎన్‌ఫీల్డ్
- సత్యవేడులో రూ. 2,200 కోట్లతో భారీ తయారీ యూనిట్ ఏర్పాటు
- తమిళనాడు వెలుపల సంస్థ ఏర్పాటు చేస్తున్న తొలి ప్లాంట్ ఇదే
- ప్రాజెక్టు ద్వారా దాదాపు 5,000 ఉద్యోగాల కల్పన
- పెట్టుబడికి ఆమోదం తెలిపిన ఏపీ రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి

ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక రంగానికి భారీ ఊతం లభించింది. ప్రముఖ ఆటోమొబైల్ దిగ్గజం, ఐకానిక్ మోటార్‌సైకిల్ బ్రాండ్ రాయల్ ఎన్‌ఫీల్డ్ తన నూతన తయారీ యూనిట్‌ను ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేయనుంది.




2లో

## ఏపీలో వాహన రిజిస్ట్రేషన్ ఇక 24 గంటల్లోనే..

ఆంధ్రప్రదేశ్‌లో కొత్త వాహనాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను సులభతరం చేస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై కేవలం 24 గంటల్లోనే శాశ్వత రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తికానుంది. ఈ మేరకు రవాణా శాఖ రూపొందించిన కొత్త విధానానికి ఈ వారంలోనే ప్రభుత్వం ఆమోదం తెలిపే అవకాశం ఉంది. వాహనాల రిజిస్ట్రేషన్‌లో జరుగుతున్న జాప్యంపై ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వెంటనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. దీంతో రవాణా శాఖ ఈ కొత్త విధానాన్ని ప్రతిపాదించింది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా సుమారు 27 వేల వాహనాలు శాశ్వత రిజిస్ట్రేషన్ కోసం పెండింగ్‌లో ఉన్నాయి. కొత్త విధానం ప్రకారం డీలర్ తాత్కాలిక రిజిస్ట్రేషన్ చేసి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన 24 గంటల్లోపు రవాణా శాఖ అధికారులు శాశ్వత రిజిస్ట్రేషన్‌ను ఆమోదించాలి. ఫ్యాన్సీ నంబర్లు కోరుకునే వారికి ఈ నిబంధన వర్తించదు. ఒకవేళ అధికారులు గడువులోగా ఆమోదం తెలపడంలో విఫలమైతే సిస్టమ్ ఆటోమేటిక్‌గా రిజిస్ట్రేషన్‌కు ఆమోదం తెలుపుతుంది. సెలవు రోజుల్లో కూడా అధికారులు ఆన్‌లైన్‌లో ఈ ప్రక్రియను పూర్తి చేయవచ్చు. తొలుత శాశ్వత రిజిస్ట్రేషన్ అధికారాన్ని డీలర్లకే అప్పగించాలని సీఎం సూచించినప్పటికీ, న్యాయపరమైన చిక్కులు రావొచ్చని అధికారులు వివరించారు. దీంతో రిజిస్ట్రేషన్ అధికారాన్ని రవాణా శాఖ వద్దే ఉంచి, 24 గంటల కాలపరిమితితో కూడిన విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించారు. ఈ దస్త్రం ప్రభుత్వ ఆమోదం పొందగానే కొత్త విధానం అమల్లోకి రానుంది.

## కరీంనగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై దాడి..

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై దాడి జరిగిన విషయం తనకు ఆలస్యంగా తెలిసిందని అన్నారు. దాడులు చేయడం, దౌర్జన్యాలకు దిగడం తమ సంస్కృతి కాదని అన్నారు. కానీ బీఆర్ఎస్ నాయకులు తమ సహనాన్ని పరీక్షించవద్దని బండి సంజయ్ అన్నారు. ప్రస్తుతం బీఆర్ఎస్ నేతల నీతి వ్యాఖ్యలు చూస్తుంటే నవ్వొస్తుందని అన్నారు. పదేళ్లలో ఆ పార్టీ చేసిన అరాచకాలను ప్రజలు మరిచిపోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.బీఆర్ఎస్ పాలన రజాకార్లను తలపించిందని ఆరోపించారు. దాడుల సంస్కృతిని ఆ పార్టీయే ఆరంభించిందని విమర్శించారు. గతంలో తాను చేపట్టిన ప్రజాసంగ్రామయాత్రను అడ్డుకోవడానికి బీఆర్ఎస్ శ్రేణులు ఎన్నో ఇబ్బందులు సృష్టించాయని అన్నారు. నాడు పదుల సంఖ్యలో కార్లను ధ్వంసం చేశారని ధ్వజమెత్తారు. మహిళా కార్యకర్తలపై కూడా దాడులు చేశారని ధ్వజమెత్తారు. గతంలో చేసిన దాడులను మరిచిపోయి ఇప్పుడు సానుభూతి కోసం ప్రయత్నిస్తున్నారని బండి సంజయ్ అన్నారు.

## ఏపీకి రాయల్ ఎన్‌ఫీల్డ్.. రూ. 2,200 కోట్ల భారీ పెట్టుబడి

(మొదటి పేజీ తరువాయి)

1901లో సంస్థ ప్రారంభమైన నాటి నుంచి తమిళనాడు వెలుపల ఇంత భారీ స్థాయిలో విస్తరించడం ఇదే తొలిసారి కావడం విశేషం.తిరుపతి జిల్లా సత్యవేడులో ఈ అత్యాధునిక తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం కంపెనీ రెండు దశల్లో సుమారు రూ. 2,200 కోట్లు పెట్టుబడిగా పెట్టనుంది. ఈ ప్రాజెక్టుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన సమావేశమైన రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ) ఆమోదం తెలిపింది. ఈ ప్లాంట్ ద్వారా రాయల్ ఎన్‌ఫీల్డ్ తయారీ సామర్థ్యం దాదాపు 9 లక్షల యూనిట్లు పెరగనుంది. ఈ ప్రాజెక్టు కోసం సత్యవేడు మండలంలోని వన్నెలూరు (233.76 ఎకరాలు), రాళ్ళకుప్పం (42.38 ఎకరాలు) గ్రామాల్లో ప్రభుత్వం మొత్తం 267 ఎకరాల భూమిని కేటాయించింది. ఈ యూనిట్ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 5,000 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. మొదటి దశలో ప్రధాన తయారీ యూనిట్‌తో పాటు, ఒక ప్రత్యేక వెండర్ పార్క్‌ను కూడా అభివృద్ధి చేయనున్నారు. దీనివల్ల సంస్థకు చెందిన సరఫరాదారులు కూడా ఏపీకి

తరలివచ్చి, రాష్ట్రంలో ప్రపంచ స్థాయి ఆటోమోటివ్ తయారీ క్లస్టర్ ఏర్పడటానికి దోహదపడుతుంది. మొదటి దశ 2029 నాటికి, రెండో దశ 2032 నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.ఈ పరిణామంపై రాష్ట్ర ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. "రాయల్ ఎన్‌ఫీల్డ్ కేవలం ఒక మోటార్‌సైకిల్ బ్రాండ్ కాదు, అది వారసత్వం, నాణ్యతకు ఒక ప్రతీక. ఇంతటి ఐకానిక్ కంపెనీని ఏపీకి స్వాగతిస్తున్నందుకు గర్వంగా ఉంది. వ్యాపార నిర్వహణలో ఏపీ వేగం, ఇక్కడి మౌలిక సదుపాయాలకు ఈ పెట్టుబడి నిదర్శనం. ఈ ప్లాంట్‌తో పాటుగా వచ్చే అనుబంధ పరిశ్రమలతో రాష్ట్రాన్ని ప్రపంచ స్థాయి ఆటోమొబైల్, అడ్వాన్స్‌డ్ మానుఫ్యాక్చరింగ్ హబ్‌గా తీర్చిదిద్దాలన్న మా లక్ష్యం మరింత బలపడుతుంది" అని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుతో ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంతంలో పారిశ్రామికాభివృద్ధి మరింత వేగవంతం కానుంది.

## తమిళనాడు రాజకీయాలపై డీకే శివకుమార్ హాట్ కామెంట్స్

(మొదటి పేజీ తరువాయి)

ప్రజల తీర్పును, మనోభావాలను గౌరవించాలని గవర్నర్‌కు సూచన నటుడు విజయ్ నేతృత్వంలోని 'తమిళగ వెట్రి కళగం' పార్టీకి ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశం నిరాకరిస్తూ తమిళనాడు గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ తీసుకున్న నిర్ణయంపై కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ తీవ్రంగా స్పందించారు. గవర్నర్ చర్య పూర్తిగా అప్రజాస్వామికమని ఆయన విమర్శించారు. గురువారం బెంగళూరులోని విధాన సౌధలో విలేకరులతో మాట్లాడుతూ, సంఖ్యాబలం ఉన్న పార్టీని ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించి, మెజారిటీ నిరూపించుకోకుండా అడ్డుకునే అధికారం గవర్నర్‌కు లేదని స్పష్టం చేశారు. "ప్రభుత్వ ఏర్పాటుకు విజయ్‌ను అడ్డుకునే అధికారం తమిళనాడు గవర్నర్‌కు ఏమాత్రం లేదు. ఆయన ప్రవర్తన సరైనది కాదు" అని డీకే శివకుమార్ అన్నారు.గతంలో కర్ణాటక, జాతీయ స్థాయిలో జరిగిన రాజకీయ పరిణామాలను ఆయన గుర్తుచేశారు.

# బెంగాల్ అసెంబ్లీని రద్దు చేసిన గవర్నర్..




పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో సంచలనం చోటుచేసుకుంది. రాష్ట్ర గవర్నర్ ఆర్.ఎన్. రవి, పశ్చిమ బెంగాల్ అసెంబ్లీని రద్దు చేస్తూ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు నేడు (మే 7) అధికారిక నోటిఫికేషన్ జారీ చేశారు. దీంతో మమతా బెనర్జీ ముఖ్యమంత్రి పదవి అధికారికంగా ముగిసింది."భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 174, క్లాజ్ 2 ప్రకారం నాకు దఖలుపడిన అధికారాలను ఉపయోగించి, పశ్చిమ బెంగాల్ శాసనసభను 2026 మే 7 నుంచి రద్దు చేస్తున్నాను" అని గవర్నర్ తన నోటిఫికేషన్‌లో స్పష్టంగా పేర్కొన్నారు.ఇటీవల జరిగిన రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. అయితే, ఎన్నికల ఫలితాలను అంగీకరించని మమతా బెనర్జీ, ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసేందుకు నిరాకరించారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో రాజకీయ సంక్షోభం తలెత్తడంతో గవర్నర్ ఈ కఠిన నిర్ణయం తీసుకున్నారు.మరోవైపు, ఈ పరిణామంపై మమతా బెనర్జీ తీవ్రంగా స్పందించారు. ఎన్నికల్లో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగాయని, ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ల (ఈవీఎం) ట్యాంపరింగ్ ద్వారానే బీజేపీ గెలిచిందని ఆమె ఆరోపించారు. ఎన్నికల సంఘం కూడా బీజేపీతో కుమ్మక్కై తన ప్రభుత్వాన్ని కూల్చేందుకు కుట్ర పన్నిందని విమర్శించారు. బీజేపీ విజయాన్ని "అనైతికం" అని ఆమె అభివర్ణించారు.గవర్నర్ నిర్ణయంతో రాష్ట్రంలో కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు మార్గం సుగమమైంది. ఎల్లుండి బీజేపీ నేతృత్వంలో నూతన ప్రభుత్వం కొలువుదీరనున్నట్టు సమాచారం.

# విజయ్‌కు మళ్లీ గవర్నర్ మొండిచేయి..

వెనుకాడబోమని టీవీకే ఎమ్మెల్యేలు ప్రతినబూనారన్న వార్త తమిళనాట సంచలనం సృష్టిస్తోంది. 24 గంటల వ్యవధిలో రెండుసార్లు ప్రత్యేకంగా కలిసి అభ్యరి?థంచినా గవర్నర్ మనసు మార్చుకోకపోవడంతో సర్వోన్నత న్యాయస్థానంలో న్యాయపోరాటానికి సిద్ధపడేందుకు టీవీకే రెడీగా ఉందన్న వార్త చక్కర్లు కొడుతోంది. ఆలోపు భావసారూప్య పార్టీల మద్దతు కూడగట్టేందుకూ టీవీకే శతథా ప్రయత్నిస్తోంది. టీవీకే అభ్యర్థనతో మద్దతు ఇచ్చే ఆలోచన ఉన్నా బీజేపీ ఒత్తిడి కారణంగా అంతటి సాహసం చేసే దమ్ములేక అన్నాడీఎంకే మిన్నకుండిపోయిందని వార్తలు వినవస్తున్నాయి. టీవీకే కూటమిలోకి దూకేయకుండా తమ ఎమ్మెల్యేలను కాపాడుకునేందుకు ఇప్పటికే అన్నాడీఎంకే రిసార్ట్ రాజకీయాలకు శ్రీకారం చుట్టింది. అటు అన్నాడీఎం కలిసిరాక, ఇటు ఐదుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేల మద్దతు సరిపోక విజయ్ ఇతర పార్టీల అగ్రనేతలతో సమాలోచనలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. దీంతో తమిళనాట ఏ పార్టీ/కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేస్తుందనే దానిపై తలపండిన రాజకీయ పండితులు సైతం ఎటూ తేల్చలేకపోతున్నారు.

**మరోసారి లోక్‌భవన్‌కు..**

గవర్నర్ అర్లేకర్ నుంచి వచ్చిన ఆదేశాల మేరకు విజయ్ గురువారం లోక్‌భవన్‌కు వెళ్లారు. తమకు అవకాశమిస్తే అసెంబ్లీ బల నిరూపణ చేసుకుంటామని గవర్నర్‌ను లిఖితపూర్వకంగా అభ్యరి?థంచారు. ఇందుకు గవర్నర్ నుంచి సానుకూల స్పందన కరువైంది. 118 మంది ఎమ్మెల్యేల మద్దతుతో వస్తేనే సాధారణ మెజార్టీ సాధించినట్లు భావించి ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశమిస్తానని విజయ్‌కు గవర్నర్ స్పష్టంచేశారు. తమకంటే ముందుగా మరే పార్టీ లేదా కూటమికి ప్రభుత్వ ఏర్పాటు అవకాశం ఇవ్వొద్దని విజయ్ కోరారని, అందుకు గవర్నర్ సమ్మతి తెలిపారని లోక్‌భవన్ వర్గాలు వెల్లడించాయి. గవర్నర్‌తో విజయ్ భేటీ 40 నిమిషాల్లోపే ముగిసింది.

**అనూహ్యంగా షణ్ముగం రాజీనామా**

అన్నాడీఎంకే సీనియర్ నేత, రాజ్యసభ సభ్యుడు సీవీ షణ్ముగం గురువారం రాత్రి అనూహ్యంగా తన రాజ్యసభ స్థానానికి రాజీనామా చేశారు. ఢిల్లీకొచ్చి సంబంధిత ఉన్నతాధికారికి తన రాజీనామా లేఖను అందజేశారు. విజయ్‌తో అన్నాడీఎంకే పొత్తు పెట్టుకుంటే రాష్ట్రానికి క్షేమదాయకమని ఫలితాలు వెల్లడయ్యాక షణ్ముగం వ్యాఖ్యానించడం తెల్సిందే. దీంతో అన్నాడీఎంకేను చీల్చి తన వర్గం ఎమ్మెల్యేలను టీవీకేకు మద్దతు ఇచ్చేలాచేసి ప్రభుత్వ ఏర్పాటుకు షణ్ముగం ప్రయత్నిస్తున్నారని వార్తలొచ్చాయి. దీనిపై ఆయన స్పందించారు. "దీనిపై నేనేమీ మాట్లాడను. నాకేమీ తెలియదు" అని అన్నారు. డీఎంకేతో అన్నాడీఎంకే పొత్తు ప్రతిపాదనలను మొదట్నుంచీ షణ్ముగం వ్యతిరేకిస్తున్నట్లు తెలుస్తోంది. పనయూర్‌లో టీవీకే ఎమ్మెల్యేలు సమావేశమయ్యారు. ఇక్కడ ఏ నిర్ణయాలు తీసుకున్నారనేది తెలియరాలేదు. అందరూ ఐక్యంగా ఉండాలని విజయ్ కోరుకుంటున్నారని పార్టీ ముఖ్యనేత తెలిపారు. "పార్టీ అనేది అసెంబ్లీలో బలనిరూపణ చేసుకుంటుంది. మొత్తం ఎమ్మెల్యేల జాబితాను ముందస్తుగా అడగాల్సిన అవసరం గవర్నర్‌కు ఏముంది? ఉద్దేశపూర్వకంగా బీజేపీ గవర్నర్‌తో తమిళనాట రాజకీయ అస్థిరతను సృష్టిస్తోంది. గవర్నర్ వైఖరిపై శుక్రవారం నిరసనర్యాలీలు కొనసాగుతాయి" అని కాంగ్రెస్ తెలిపింది.

# రేవంత్ రెడ్డికి కనీస కనికరం లేదు హరీశ్ రావు ఆగ్రహం

(మొదటి పేజీ తరువాయి)

వడ్ల కుప్పల వద్ద రైతుల గుండెల ఆగిపోతున్నా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కనీస కనికరం లేదని బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు మండిపడ్డారు. కేసీఆర్ హయాంలో ఇలాంటి పరిస్థితిని తెలంగాణలో ఎప్పుడూ చూడలేదని అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని హరీశ్ రావు సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నెల రోజులుగా వడ్లను కొనుగోలు చేయడం లేదని విమర్శించారు.తరుగు పేరుతో రైతులను దోచుకుంటున్నారని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని మండిపడ్డారు. వడ్ల కుప్పల వద్దనే రైతుల గుండెలు ఆగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా జరుగుతున్నాయని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారని, కానీ వాస్తవాలు ఇందుకు విరుద్ధంగా ఉన్నాయని మండిపడ్డారు.నేను వారిలా ఏసీ గదిలో కూర్చుని మాట్లాడటం లేదని విమర్శించారు. రైతుల మధ్య నిల్చుని, వారి గోడు విని మాట్లాడుతున్నానని అన్నారు. కల్లాలలో రైతులు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నారని అన్నారు. తేమ పరీక్షకు పదిరోజులు, గోనె సంచులకు వారం రోజులు, కాంటా (తూకం) పెట్టడానికి మరో వారం రోజులు పడుతుందని ఆరోపించారు. మిల్లులకు వెళ్లిన తర్వాత కూడా లారీకి నాలుగైదు బస్తాల వరకు కటింగ్ పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.అకాల వర్షాలతో రైతులు తీవ్ర ఆందోళనతో ఉన్నారని హరీశ్ రావు అన్నారు. చౌటుప్పల్ మార్కెట్‌లో వర్షం పడితే కనుక వడ్ల కుప్పలు నీట మునిగే ప్రమాదం ఉందని అన్నారు. ప్రభుత్వం వెంటనే యుద్ధ ప్రాతిపదికన కొనుగోళ్లు జరపాలని డిమాండ్ చేశారు. రైతుబంధు, యూరియా, రుణమాఫీ, ధాన్యం కొనుగోళ్ల విషయంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. తరుగు పెడితే తోలు తీస్తామని గతంలో సీఎం చెప్పారని, ఇప్పుడు బస్తాకు రెండు మూడు కిలోల తరుగు తీస్తుంటే ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు.

## పిఠాపురం టీడీపీలో అనూహ్య పరిణామం..



కన్నీళ్లు ఆపుకోలేక ప్రెస్ మీట్ మధ్యలోనే లేచి వెళ్లిపోయారు. అంతకుముందు వర్మ మాట్లాడుతూ.. పార్టీ అధిష్ఠానం ఏ నిర్ణయం తీసుకున్నా దానికి తాను కట్టుబడి ఉంటానని స్పష్టం చేశారు. గత ఎన్నికల్లో పార్టీ ఆదేశాల మేరకే పనిచేశానని, పార్టీ బలోపేతం కోసమే కృషి చేశానని, ఎన్నడూ వ్యతిరేకంగా పనిచేయలేదని అన్నారు. పిఠాపురంలో ఎన్డీయే కూటమిలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకే, పార్టీ వ్యవహారాల నిర్వహణకు ఒక కమిటీని ఏర్పాటు చేయాలని తానే స్వయంగా మంత్రి నారా లోకేశ్‌ను కోరినట్లు వర్మ సంచలన విషయం వెల్లడించారు. తాను ఒక్కడినే అన్ని పనులు చూడటం కష్టంగా ఉందని, అందుకే కమిటీ వేయమని అడిగానని, ఈ నేపథ్యంలోనే అధిష్ఠానం ఈ నిర్ణయం తీసుకుని ఉండవచ్చని తన అనుచరులకు వర్మ వివరించినట్లు సమాచారం. కొన్ని రాజకీయ పరిణామాల దృష్ట్యా పార్టీలో మార్పులు సహజమని, అధిష్ఠానం పార్టీ శ్రేయస్సు కోసమే నిర్ణయాలు తీసుకుంటుందని ఆయన పేర్కొన్నారు. పిఠాపురంలో పార్టీని నేతలే నడిపిస్తారని, అధిష్ఠానం ఏ నిర్ణయం తీసుకున్నా తాను పూర్తి సహకారం అందిస్తానని స్పష్టం చేశారు.మొత్తం మీద పిఠాపురం వంటి కీలక నియోజకవర్గంలో వర్మను బాధ్యతల నుంచి తప్పించడం ఆసక్తికరంగా మారింది. త్వరలో ఏర్పాటు చేయబోయే కమిటీలో వర్మకు స్థానం కల్పిస్తారా? లేదా? అన్న దానిపై రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది.

## అధికారం దక్కలేదనే కేటీఆర్ ఆక్రోశం

రైతుల ప్రాణాలతో ఆటలాడినవారే ఇప్పుడు రైతు మిత్రులమంటూ మాట్లాడటం ప్రజలను మోసం చేయడమేనన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పంటల బీమా ఎత్తివేసి, వరదలు--వర్షాలతో నష్టపోయిన రైతులకు ఒక్క పైసా పరిహారం ఇవ్వలేదని చెప్పారు. రుణమాఫీ పేరుతో రైతులను మోసం చేసి అప్పుల బారినుంచి బయటపడే అవకాశం లేకుండా చేసిందే బీఆర్ఎస్ అని మండిపడ్డారు. అందుకే రైతులే వారిని అధికారానికి దూరం చేశారని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం రైతు సంక్షేమంలో చరిత్ర సృష్టిస్తోందన్నారు. పంట నష్ట పరిహారం కింద ఎకరాకు రూ.10 వేల చొప్పున సాయం అందిస్తున్నామని, నెలకు సగటున రూ.5,500 కోట్లకు పైగా రైతుల కోసం ఖర్చు చేస్తున్నామని చెప్పారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం నెలకు రూ.2,533 కోట్లు మాత్రమే ఖర్చు చేసిందన్నారు. రెండేళ్లలోనే రైతుల కోసం లక్షా 5 వేల కోట్ల రూపాయలకు పైగా ఖర్చు చేసి, రైతు భరోసా, రుణమాఫీ, బీమా వంటి పథకాలతో రైతులకు నిజమైన అండగా నిలిచామని పేర్కొన్నారు. రైతు పేరుతో రాజకీయాలు చేసే రోజులు ముగిశాయని, తెలంగాణ రైతులు నిజాన్ని గుర్తించి తగిన సమాధానం ఇస్తారని మంత్రి స్పష్టం చేశారు. రాహుల్‌గాంధీ వరంగల్ రైతు డిక్లరేషన్‌లో చెప్పిన విధంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో మా ప్రభుత్వం అధికారంలోకి రాగానే అన్ని హామీలను నెరవేర్చిందన్నారు.

## భార్య పుట్టింట్లో బంగారు ఆభరణాల చోరీకి పాల్పడిన భర్త అరెస్ట్

### రూ.9 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం,.

### మద్యం, జూదం వంటి చెడు వ్యసనాలకు బానిసైన వ్యక్తి చోరీకి పాల్పడిన ఘటన.

గుంటూరు:చేబ్రోలు పోలీస్ స్టేషన్ పరిధిలోని వేజెండ్ల గ్రామానికి చెందిన సాతర్ల తిరుపతమ్మ తన ఇంటిలో గుర్తుతెలియని వ్యక్తులు ప్రవేశించి మెయిన్ డోర్ తెరిచి, ఇనుప బీరువా తాళాలు పగులగొట్టి సుమారు రూ.9,00,000/- విలువైన 72 గ్రాముల బంగారు ఆభరణాలు మరియు కొన్ని వెండి ఆభరణాలు దొంగిలించారని ఫిర్యాదు చేశారు.దీనిపై చేబ్రోలు పోలీస్ స్టేషన్ ఎస్సై వీరనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కేసు దర్యాప్తులో భాగంగా అందిన విశ్వసనీయ సమాచారం మేరకు తెనాలి డీఎస్పీ శ్రీ జనార్ధన్ రావు గారి పర్యవేక్షణలో, పొన్నూరు రూరల్ సర్కిల్ సీఐ శ్రీ కృష్ణయ్య గారు, చేబ్రోలు ఎస్సై శ్రీ వీరనారాయణ గారు మరియు సిబ్బంది కలిసి కొత్తరెడ్డిపాలెం సెంటర్ వద్ద వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఒక అనుమానిత వ్యక్తి పోలీసులను గమనించి పారిపోవడానికి ప్రయత్నించగా, వెంటనే అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో సదరు వ్యక్తి ఫిర్యాదిదారురాలి భర్త సాతర్ల గోపి (36 ) గుండవరం గ్రామ నివాసి అని తేలింది. కుటుంబ విభేదాల కారణంగా భార్యాభర్తలు విడిగా ఉంటున్నారని, భార్య తన తల్లి ఇంటి వద్ద వేజెండ్ల గ్రామంలో నివసిస్తోందని విచారణలో వెల్లడైంది.

# బీసీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించండి

## ఈనెల 10న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ హైదరాబాద్ పర్యటన సందర్భంగా బి సీల డిమాండ్లను పరిష్కరించాలి

### బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ బహిరంగ లేఖ




**ప్రభాత సూర్య మాడుగుల పల్లి (మే 07)ప్రతినిధి :** ఈనెల 10న ప్రధాని నరేంద్ర మోడీ తెలంగాణ పర్యటన సందర్భంగా బీసీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ బహిరంగ లేఖను విడుదల చేసి అనంతరం బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల మాట్లాడుతూ జనగణనలో బీసీ కులగుణన చేయాలి దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం జనాభా లెక్కలు సేకరిస్తున్న సందర్భంగా అందులో ఎస్సీ ఎస్టీల వివరాలు సేకరిస్తున్నారు కానీ బీసీల వివరాలు సేకరించడం లేదు వెంటనే జనగణనలో బీసీలను చేర్చాలి. చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలి జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీలు అసెంబ్లీ మరియు పార్లమెంట్ లో 20 శాతం కూడా దాటడం లేదని జనరల్ స్థానాలని అగ్రకులాలకి రిజర్వ్ అయ్యాయని బీసీలు చట్టసభలలోకి అడుగుపెట్టడం లేదని విచారం వ్యక్తం చేశారు. బీసీలు ఎమ్మెల్యేలుగా ఎంపీలుగా కావాలంటే కచ్చితంగా చట్టసభల్లో రిజర్వేషన్లు ఉండాల్సిందేనని అన్నారు.

**బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించండి**

బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలి కేంద్రంలో బర్రెలకు గొర్రెలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖలు ఉంటాయి గాని బీసీలకు మంత్రి శాఖ లేకపోవడం బాధాకరం వెంటనే బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలి. ఎస్సీ,ఎస్టీల మాదిరిగా బీసీలకు కూడా అట్రాసిటీ చట్టం వర్తింపజేయాలి గ్రామాలలో చిన్నచిన్న కులాలను కులవృత్తి చేసుకునే వారిని కులాల పేరుతో అవమానకరంగా పిలుస్తూ దాడులు చేస్తున్నారని బీసీలకు కూడా అట్రాసిటీ చట్టం ఉండాల్సిందేనని అన్నారు. బీసీల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించి ప్రధాని నరేంద్ర మోడీ గారుఅభినవ పూలేగా చరిత్రలో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ పట్టణ అధ్యక్షులు బంటు వెంకటేశ్వర్లు ముదిరాజ్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు యర్రబెల్లి దుర్గయ్య రజక,బీసీ యువజన సంఘం పట్టణ కార్యదర్శి దోనేటి శేఖర్, బీసీ యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉరిబండి శ్రీనివాస్ యాదవ్, బీసీ యువజన సంఘం పట్టణ సెక్రటరీ బంటు సైదులు

# సాకి చెరువులో గుర్రపు డెక్క తొలగింపు పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే జీఎంఆర్..




**పటాన్చెరు, మే 7,ప్రభాత సూర్య :** పటాన్చెరు మండలం లోని చెరువుల సంరక్షణ కోసం శరవేగంగా గుర్రపుడెక్క తొలగింపు పనులను చేపడుతున్నట్లు పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. పటాన్చెరు డివిజన్ పరిధిలోని సాకి చెరువులో 70 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న గుర్రపు డెక్క తొలగింపు పనులను గురువారం ఉదయం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమయ్యే లోపు పనులు పూర్తి కావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. డివిజన్ పరిధిలోని తిమ్మక్క చెరువు, జేపీ కాలనీ డివిజన్ పరిధిలోని దోషం చెరువులలోను ఒక కోటి రూపాయల అంచనా వ్యయంతో అతి త్వరలో గుర్రపు డెక్క తొలగింపు పనులను ప్రారంభించనున్నట్లు తెలిపారు. గుర్రపు డెక్క తొలగించడం వలన చెరువు నీటి సామర్థ్యం పెరగడంతో పాటు చెరువుల పరిశుభ్రత మెరుగుపడటం, భూగర్భ జలాలు మట్టం పెరగడం వంటి లాభాలు జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు మెట్టు కుమార్ యాదవ్, సపాన దేవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, సీనియర్ నాయకులు నివార్తి, ఎట్టయ్య, టప్పు కుమార్, నర్రా బిక్షపతి, వెంకటేష్, సత్తయ్య, రామ్మోహన్, ఏఈ ఫైజాన్, తదితరులు పాల్గొన్నారు.



## కదిలే మేఘం

**కూకట్ పల్లి, మే 07 (ప్రభాత సూర్య):**

విద్యార్థి జ్ఞానార్ధి
పాఠశాల వొడిలో
గురుబోధల
ఔపోసనల
చలనశీలి
చైతన్యధీప్తి
జ్ఞానాన్ని గుప్పిటపట్టి
వర్తమాన వెన్నుపై
భవిష్య ప్రగతి నిర్మాణానికి
కదిలే మేఘం విద్యార్థి
జ్ఞానార్జన జగతికొరకు
జ్ఞానం శీలతకొరకు
ధర్మార్ధ కామమోక్ష పురుషార్ధ నియమాల
బోధివృక్షమే పాఠశాల
సారంలేని చదువులు
బాధ్యతలెరుగని బతుకులు
సంస్కారమెరుగని
సానిబతుకులు
చచ్చుపుచ్చుల బతుకులన్నీ
నేలజారిన నేతిచందమే...
పారే నీటిలా
వీచే గాలిలా
జ్ఞానం పయనించాల్సిందే
జ్ఞానం పంచాల్సిందే
జ్ఞానమేఘమా...
పయనించు...
వర్షించు...
జ్ఞాననిధుల
ఫలాలు పండగ

-కొండూరి. కోటిబాబు, అడ్వకేట్,
ఎస్ పిటియు, హైదరాబాద్.

# బండిరమేష్‌కు ఘన సన్మానం..

## మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించిన కాంగ్రెస్ నేతలు



**కూకట్‌పల్లి, మే 07 (ప్రభాత సూర్య) :** తెలంగాణ రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్‌గా ఎంపికైన టీపీసీసీ ఉపాధ్యక్షుడు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్‌కు కాంగ్రెస్ నాయకులు ఘన సన్మానం నిర్వహించారు. కూకట్‌పల్లిలోని ఆంజనేయనగర్ కాలనీలో ఉన్న కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు శేరి సతీష్ రెడ్డి, గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, సాదు ప్రతాప్ రెడ్డి, కూకట్‌పల్లి పట్టణ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు కర్క పెంటయ్య, కూకట్‌పల్లి నియోజకవర్గ ఐఎన్‌టీయూసీ అధ్యక్షుడు కర్క నాగరాజు తో కలిసి బండి రమేష్‌ను శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాసేవ పట్ల నిబద్ధత, పార్టీ పట్ల విశ్వాసంతో ఎంతో తక్కువ సమయంలోనే బండి రమేష్ ప్రజల్లో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారని కొనియాడారు. సామాన్య ప్రజల సమస్యల పరిష్కారానికి ఎప్పుడూ ముందుండే నాయకుడిగా ఆయన పేరు తెచ్చుకున్నారని పేర్కొన్నారు. ప్రజల మన్ననలు పొందుతూ రాజకీయంగా మరింత ఉన్నత స్థాయికి ఎదిగి భవిష్యత్తులో మరిన్ని కీలక పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి బండి రమేష్ చేస్తున్న కృషి అభినందనీయమని, కూకట్‌పల్లి నియోజకవర్గంలో పార్టీకి కొత్త ఉత్సాహం తీసుకొస్తున్న నాయకుడిగా ఎదుగుతున్నారని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గొట్టిముక్కల జస్వంత్ రావు, కొండల్ రెడ్డి, అరవింద్ రెడ్డి, మేకల మైఖేల్, అశోక్, సంజీవరావు, శ్రీధర్ చారి, గిరి నాయుడు, తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు.






## ప్రపంచ ఆర్య వైశ్య మహాసభ గ్లోబల్ సలహాదారులుగా కౌటికే విఠల్ నియామకం

**చౌటుప్పల్,మే 7, ప్రభాత సూర్య :** ప్రపంచ ఆర్య వైశ్య మహాసభ గ్లోబల్ సలహాదారులుగా ప్రముఖ చీఫ్ లైఫ్ ఇన్సూరెన్స్ సలహాదారు, సేవా కార్యక్రమాల నిర్వాహకుడు కౌటికే విఠల్ ని సంస్థ గ్లోబల్ చైర్మన్ టీ.జీ. వెంకటేష్ ప్రత్యేక సమావేశంలో నియమించారు. ఈ సందర్భంగా నియామక పత్రాన్ని అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న టీ.జీ. వెంకటేష్ మాట్లాడుతూ...కౌటికే విఠల్ బహుముఖ ప్రజ్ఞాశాలి అని కొనియాడారు. వారు ఎన్నో సంవత్సరాలుగా భారతదేశంలో చీఫ్ లైఫ్ ఇన్సూరెన్స్ సలహాదారులలో అగ్రస్థానంలో కొనసాగుతున్నారని తెలిపారు. తమ పాలసీదారుల జన్మదినోత్సవాల సందర్భంగా ప్రతి సంవత్సరం వెయ్యిమందికి ఉచిత అన్నదానం నిర్వహించడం, చలికాలంలో నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేయడం, ఎండాకాలంలో వేలాది మందికి ఉచితంగా నీటి బాటిళ్లు అందించడం వంటి అనేక సేవా కార్యక్రమాల ద్వారా సమాజంలో విశేష గుర్తింపు పొందారని పేర్కొన్నారు. ఇలాంటి సేవాభావం, నాయకత్వ లక్షణాలు, సమాజపట్ల అంకితభావాన్ని గుర్తించి ప్రపంచ ఆర్య వైశ్య మహాసభ గ్లోబల్ సలహాదారులుగా నియమించినట్లు తెలిపారు..అనంతరం కౌటికే విఠల్ మాట్లాడుతూ... తనకు ఈ పదవీ బాధ్యతలు ఇచ్చిన సందర్భంగా తాను ఆర్యవైశ్య సంఘం అభివృద్ధి కీ తొడ్పాటు అందిస్తానని తెలిపారు. ఈ సభ సభకు మడుపల్లి రవి గుప్త ,అధ్యక్షత వహించాగా ఈ కార్యక్రమంలో బి ఎన్ చారీ తదితరులు పాల్గొన్నారు.

## రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి భూసారం పెంచాలి



**మిర్యాలగూడ మే 7:-( ప్రభాత సూర్య ):** అవసరం మేరకే రసాయన ఎరువులను వాడి నేల ఆరోగ్యాన్ని కాపాడాలని కంపాసాగర్ పరిశోధన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శ్రీధర్ అన్నారు. గురువారం మిర్యాలగూడ మండలం కొత్తగూడెం గ్రామపంచాయతీ రైతువేదికలో రైతు ముంగిట శాస్త్రవేత్తలు అన్నదాతలకు అవగాహనా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రైతులు యూరియా వినియోగం తగ్గించాలని భూసారం పెంచాలని కోరారు. మార్కెట్లో డిమాండ్ ఉన్న వరి రకాలను వేసి సాగుచేయాలన్నారు. కెవికె కంపాసాగర్, ఉద్యాన శాస్త్రవేత్త టి.హిమబిందు మాట్లాడుతూ రైతులు వరి పంట ఒక్కటే కాకుండా కూరగాయలు, పండ్ల తోటలు, ఆయిల్ పామ్ లాంటి పంటలు సాగు చేయాలన్నారు. సేంద్రియ వ్యవసాయ పద్ధతులను కనీసం కుటుంబ అవసరాల మేరకైనా సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రారంభించాలన్నారు. ఉద్యాన అధికారి షేక్ నసీమా మాట్లాడుతూ ఉద్యాన శాఖ అందిస్తున్న సబ్సిడీల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎఇఓ , జ్యోతి గూడూరు, ఎస్.గోపి, ఊట్లపల్లి, ఎండీ.షఫి తుంగపహాడ్, ఉపసర్పంచ్ ఎం.సురేందర్ రెడ్డి, రైతు ఎండీ. మహమూద్, స్వయం సహాయక సంఘాల మహిళలు ఎం.ధనలక్ష్మి, పి.దేవి రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రాష్ట్ర వడ్డెర సహకార సంస్థ చైర్ పర్సన్ గా గుంజ రేణుక నియామకం



**కూకట్ పల్లి, మే 07 (ప్రభాత సూర్య) :** తెలంగాణ రాష్ట్ర వడ్డెర కో ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్ పర్సన్ గా సీనియర్ కాంగ్రెస్ నాయకురాలు, పిసిసి సభ్యురాలు, అఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘం, జాతీయ మహిళా ప్రధాన కార్యదర్శి గుంజ రేణుక నారాయణ నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే. రామకృష్ణారావు అయనను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ గా నియమితులైన గుంజ రేణుక మాట్లాడుతూ తన సేవలను గుర్తించి ఎంతో నమ్మకంతో అప్పజెప్పిన ఈ పదవీ బాధ్యతలు మరింత బాధ్యతను పెంచాయని, పార్టీ పటిష్టతకు, సంఘ అభ్యున్నతికి తన వంతు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి కి, మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి కి, జానారెడ్డి కి , పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కి, సంఘం వ్యవస్థాపక గౌరవ జాతీయ అధ్యక్షులు ఎం. నారాయణస్వామి కి, జాతీయ ప్రధాన కార్యదర్శి గుంజ శ్రీనివాస్ కి, రాష్ట్ర గౌరవ అధ్యక్షులు జివి నారాయణ, రాష్ట్ర అధ్యక్షులు మంజల రమేష్, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు వంటిపులి శ్రీనివాస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుంజ నరసింహ, రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు కుంచపు రమా, రాష్ట్ర కార్మిక విభాగం అధ్యక్షులు సాతాల గోపాల్, రాష్ట్ర కార్మిక విభాగం ప్రధాన కార్యదర్శి ఇడిగోటి నాగేష్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు రాపెన్ గిరిబాబు, ఉమ్మడి నల్గొండ జిల్లా అధ్యక్షులు వేముల సుధాకర్, ఉమ్మడి మేడ్చల్ జిల్లా అధ్యక్షులు ఇరగదిండ్ల వెంకటేష్, ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షులు రాయల రమణయ్య, యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు గుర్రం కుమారస్వామి, కుల బంధువులందరి తరపున రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపడంతో పాటు కుల బంధువులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.



## మిర్యాలగూడ ఆర్డీవోగా బాధ్యతలు స్వీకరించిన రమణారెడ్డి

### స్వాగతం పలికిన తహసీల్దార్లు సిబ్బంది

**మిర్యాలగూడ ,మే 7 :-( ప్రభాత సూర్య) :** మిర్యాలగూడ రెవెన్యూ డివిజనల్ అధికారిగా ఎస్. రమణారెడ్డి గురువారం మధ్యాహ్నాం బాధ్యతలు స్వీకరించారు. మిర్యాలగూడలో సబ్ కలెక్టర్ గా పని చేస్తున్న నారాయణ్ అమిత్ మాలెంపాటి ఐఏఎస్ శేరిలింగంపల్లి జిహెచ్ఎంసి జోనల్ కమిషనర్ గా బదిలీ కాగా ఆయన స్థానంలో నల్గొండ భూసేకరణ ఆర్ అండ్ ఆర్ లో డిప్యూటీ కలెక్టర్ గా పనిచేస్తున్న వెంకటేశ్వర్లును ఎఫ్ ఏ సి గా కొన్ని రోజులుగా వ్యవహరిస్తున్నారు. నల్గొండ జిల్లా దేవరకొండ డిప్యూటీ కలెక్టర్ గా పనిచేస్తున్న ఎస్ రమణారెడ్డిని బదిలీపై మిర్యాలగూడ ఆర్డీవో గా వచ్చారు. కార్యాలయంలో పనిచేసే డిప్యూటీ తహసిల్దార్ చాంద్ పాషా, జూనియర్ అసిస్టెంట్ జమాల్, అబ్బాస్, ఉమేరా, అఫ్రోజ్, కార్యాలయా సిబ్బంది, తదితరులు మొక్కను అందజేసి స్వాగతం పలికారు. మిర్యాలగూడ తహసిల్దార్ శ్రీనివాస్ శాలువాతో సన్మానించి తాసిల్దార్ కార్యాలయ సిబ్బందిని పరిచయం చేశారు. డిప్యూటీ తహసిల్దార్ ప్రవీణ్ కుమార్, ఆర్ ఐ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా నివాన్, నివిత జన్మదిన వేడుకలు



**నల్గొండ ప్రభాత సూర్య :** నల్గొండ జిల్లా కేంద్రంలోని శుక్రవారం రత్నా ఫంక్షన్ హాల్ లో నివాన్,నివేత తల్లిదండ్రులు పులిపాటి నవీన్ బాబు వనజ, తాత నానమ్మ మార్కొండయ్య ఆదిలక్ష్మి లు మరియు తాత అమ్మమ్మ మహేశ్వరం యాదగిరి లక్ష్మీలు ఏర్పాటుచేసిన జన్మదిన వేడుకలను కుటుంబ సభ్యులు బంధుమిత్రులు శ్రేయోభిలాషుల మధ్యలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు మాట్లాడారు. కోటి కాంతుల చిరునవ్వుతో భగవంతుడు నివాన్, నివిత ల యొక్క మొదటి జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్నందుకు ఎంతో సంతోషంగా ఉన్నదని ఆ భగవంతుడు నిండు నూరేళ్లు ప్రసాదించాలని ఇలాంటి పుట్టినరోజులు ఎన్నో జరుపుకోవాలని ఆశీర్వదించారు. భవిష్యత్తులో మంచి ఉన్నత విద్యలను అభ్యసించి ఐఏఎస్, ఐపీఎస్ కావాలని సమాజానికి సేవలో ఉండాలని మరియు భక్తిశ్రద్ధలతో నడుచుకోవాలని ఆకాంక్షించారు. మా యొక్క చిన్నారులను ఆశీర్వదించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు

## మిర్యాలగూడ మున్సిపాలిటీలో ఏసీబీ అధికారుల సోదాలు అర్ధరాత్రి వరకు కొనసాగే అవకాశం





**మిర్యాలగూడ మే 7:-( ప్రభాత సూర్య):** నల్గొండ జిల్లా మిర్యాలగూడ మున్సిపాలిటీపై గురువారం ఏసీబీ అధికారులు అకస్మాత్తుగా తనిఖీలు చేపట్టారు. ఏసీబీ డి ఎస్ పి జగదీష్ చంద్ర నేతృత్వంలో ఇద్దరు సిఐలు, ముగ్గురు ఎస్ఐలతో కలిసి ఉదయం ఒక్కసారిగా కార్యాలయంలోకి వచ్చి సిబ్బంది నుండి సెల్ ఫోన్లు, ఫైల్స్ ను తీసుకొని మున్సిపల్ కార్యాలయ గేటుకు తాళాలు వేసి రికార్డులను పరిశీలిస్తున్నారు. ఏసీబీ అధికారుల రాకతో మిర్యాలగూడ మున్సిపాలిటీ ఒక్కసారిగా హులిక్కిపడింది. ఇటీవల మున్సిపల్ కార్యాలయంలో పలు అవినీతి అక్రమాలు జరుగుతున్నాయని సమాచారం అందడంతో పాటు పలు పనులు చేయకుండానే నిధులు డ్రా చేసినట్లుగా ఆరోపణలు రావడంతో ఏసీబీ అధికారులు సోదాలు చేపడుతున్నట్లుగా సమాచారం. ఈ సోదాలు అర్ధరాత్రి వరకు కొనసాగే అవకాశం ఉందని సమాచారం.

# మానవీయ, సాంఘిక శాస్త్రాల ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్న గీతం



**పటాన్చెరు, మే 7,ప్రభాత సూర్య :** పటాన్చెరు మండలం లోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ (జీఎస్ హెచ్ఎస్) 2026-27 విద్యా సంవత్సరానికి గాను మానవీయ, సాంఘిక శాస్త్రాలలో యూజీ, పీజీ, పీహెచ్.డీ. కోర్సులలో ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఈ విషయాన్ని ఆ స్కూల్ ఇన్ ఛార్జి డైరెక్టర్ డాక్టర్ శామ్యూల్ థరు గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించారు.జాతీయ లేదా రాష్ట్ర స్థాయి ప్రవేశ పరీక్షలలో పొందిన చెల్లుబాటు అయ్యే స్కోర్ల ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తామని, అలాగే గీతం ప్రవేశ పరీక్ష (గాట్-2026) ద్వారా కూడా అర్హత సాధించవచ్చని ఆయన తెలియజేశారు. మూడో దశ ప్రవేశ పరీక్ష ఈనెల 17న జరుగుతుందని, ఆసక్తి గల అభ్యర్థులు తమ దరఖాస్తులను మే 14వ తేదీలోగా అధికారిక పోర్టల్ ద్వారా ఆన్ లైన్లో సమర్పించవచ్చన్నారు.యూజీ స్థాయిలో- సైకాలజీ, ఎకనామిక్స్, ఇంగ్లీషు, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, జర్నలిజం అండ్ మీడియా స్టడీస్, సోషియాలజీ, సినిమాటిక్ ఆర్ట్స్ అండ్ డిజైన్లు ప్రధాన అంశం (మేజర్)గా బీ.ఏ. కోర్సును అందజేస్తున్నామని తెలిపారు. వీటిలో చేరిన విద్యార్థులకు వారు ఎంచుకున్న విభాగాలలో బలమైన పునాదిని అందించడంతో పాటు, వారి విశ్లేషణాత్మక, సృజనాత్మక, భావ ప్రకటనా నైపుణ్యాలను మెరుగుపరిచేలా ఆయా కోర్సులను రూపొందించామని తెలిపారు. లిబరల్ ఎడ్యుకేషన్ లో భాగంగా, విద్యార్థుల ఆసక్తి, ఆశయాల ఆధారంగా 600కు పైగా సబ్జెక్టుల కలయికలను ఎంచుకోవచ్చన్నారు.పీజీ స్థాయిలో- అప్లైడ్ సైకాలజీ, ఎకనామిక్స్, ఇంగ్లీషులలో ఎం.ఏ. కోర్సులను అందిస్తున్నామని తెలిపారు. ఇవి ఉన్నతమైన సైద్ధాంతిక పరిజ్ఞానం, పరిశోధనా సామర్థ్యాలు, ఆచరణాత్మక అనువర్తనాలపై దృష్టి పెడతాయన్నారు. ఇక డాక్టోరల్ కోర్సులలో- అప్లైడ్ సైకాలజీ, ఎకనామిక్స్, ఇంగ్లీషు, పొలిటికల్ సైన్స్, సోషియాలజీలలో పీహెచ్.డీ. కోర్సులు ఉన్నాయని ఆయన తెలియజేశారు. ఈ రంగాలలో ఉన్నత-నాణ్యత గల పరిశోధన, విద్యా నైపుణ్యాన్ని పెంపొందించడమే వీటి లక్ష్యమన్నారు.విద్యతో పాటు క్రీడలు, ఇతరత్రా కార్యకలాపాలు, సామాజిక పరస్పర చర్యలతో అనుసంధానించడం ద్వారా సంపూర్ణ విద్యకు జీఎస్ హెచ్ఎస్ ప్రాధాన్యత ఇస్తోందని డాక్టర్ శామ్యూల్ వివరించారు. అత్యాధునిక బోధనా ప్రయోగశాలలు, విస్తృతమైన ఇంటర్న్షిప్ అనుభవం, పరిశోధనపై దృష్టి సారించే అధ్యాపక బృందం సమగ్రమైన బోధనను అందించడంలో సహాయపడుతుందని తెలిపారు. విద్యాపరమైన విజయాలకు అతీతంగా విద్యార్థులను తీర్చిదిద్ది, విజ్ఞానవంతమైన దృక్పథాలు, విమర్శనాత్మక ఆలోచనల ద్వారా సమాజానికి అర్థవంతంగా దోహదపడేలా వారికి సాధికారత కల్పించడానికి గీతం కట్టుబడి ఉందన్నారు. గీతంలోని దాదాపు 33 శాతం మంది విద్యార్థులు ప్రతిభ ఆధారిత ఉపకార వేతనాలు పొందుతున్నారని, వీటిలో బోధనా రుసుము, భోజనం, వసతి ఖర్చులతో సహా పూర్తి మినహాయింపులున్నాయని తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 14వ తేదీలోగా ఆన్ లైన్లో దరఖాస్తు చేసుకుని, మే 17న జరిగే ప్రవేశ పరీక్ష, వ్యక్తిగత ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు. ఇతరత్రా సమాచారం కోసం www.gitam.edu ను సందర్శించాలని, లేదా 888 4984 000 ను సంప్రదించాలని సూచించారు.

## హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూముల స్వాధీనం కోసం ప్రణాళిక రూపొందించాం

### హైడ్రా కమీషనర్ ఎ.రంగనాథ్



**మిర్యాలగూడ మే 7:- (ప్రభాత సూర్య):** హైద్రాబాద్ పరిసరాల్లో అన్యాక్రాంతమైన సుమారు 2నుండి 3లక్షల కోట్ల ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలు స్వాధీనం చేసుకోవడమే లక్ష్యంగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించామని హైడ్రా కమీషనర్ ఎ.రంగనాథ్ అన్నారు. గురువారం స్థానిక ఎన్ఎస్పి అతిథిగృహంలో విలేఖరులతో మాట్లాడుతూ ఇప్పటివరకు రూ.లక్ష కోట్ల విలువైన చెరువులు, ప్రభుత్వ భూములు సుమారు 2,100 ఎకరాలు కాపాడామని రంగనాథ్ అన్నారు. ఉపగ్రహ, సాంకేతిక పరిజ్ఞానంతో ఆక్రమణలు గుర్తించి తొలగిస్తున్నామని ఆయన అన్నారు. హైదరాబాద్ పరిసరాల్లో ఉన్న చెరువులు, కుంటలు ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురి కాగా ఆక్రమణదారులు ఎంతటి వారైనా ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్, కాంగ్రెస్, ప్రతిపక్షాలకు చెందిన ఆక్రమణలను తొలగించామని, స్వాదీనం చేసుకున్నామని ఆయన అన్నారు. ప్రస్తుతం హైదరాబాద్ లో 25 చెరువులు స్వాధీనం చేసుకుని పునరుద్దరించామన్నారు. మరో వంద చెరువులను గుర్తించామని, స్వాదీనానికి కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నట్లు, ప్రభుత్వం సంకేతమివ్వగానే స్వాధీనం చేసుకుంటామని ఆయన అన్నారు. స్వాధీనం చేసుకున్న భూముల్లో ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజలకు ఆహ్లాదం కల్పించే ఫిజికల్ ఫిట్నెస్ పార్కులు, వాకింగ్ ట్రాక్ నిర్మించనున్నట్టు ఆయన తెలిపారు. చట్టభద్దత ఉన్న హైడ్రా హై కోర్టు ఇచ్చిన సూచనల మేరకే ఆక్రమణలు తొలగిస్తున్నామన్నారు. ఇటీవల అమిన్ పూర్ లో ముఖిమ్ సంధ్య, శ్రీధర్ రావు, మల్లారెడ్డి భూములను కూడ స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. హైడ్రాబాద్ లో ఇప్పటివరకు 30,000 ఫిర్యాదులు వచ్చాయని జిల్లాల నుండి ఫిర్యాదులు వస్తున్నాయని జిల్లాల్లో కూడ హైడ్రా కార్యక్రమాలు చేపట్టాలని కోరుతున్నారని ఆయన అన్నారు.

## మంత్రి కొండా సురేఖ 'జైశ్రీరామ్' వ్యాఖ్యలపై రాజాసింగ్ తీవ్ర ఆగ్రహం

కొండా సురేఖ ఏ శాఖకు మంత్రో గుర్తుంచుకోవాలన్న రాజాసింగ్

జైశ్రీరామ్ అంటే కొండంత బలం వస్తుందన్న రాజాసింగ్

రేవంత్ రెడ్డి ఆమెను పిలిపించి రాజీనామా కోరాలని డిమాండ్

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గతంలో ఏబీవీపీలో ఉన్నప్పుడు 'జైశ్రీరామ్' అన్నారని, మరి తన కేబినెట్ మంత్రికి దానిని నేర్పించలేదా అని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ ప్రశ్నించారు. 'జైశ్రీరామ్' అంటే పైనుంచి డబ్బులు రాలుతాయా అని ప్రశ్నించిన మంత్రి కొండా సురేఖపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. దేవాదాయ శాఖ మంత్రి అంటే దేవుడికి అనుకూలంగా ఉండాలని, కానీ కొండా సురేఖ మాత్రం భిన్నంగా మాట్లాడుతున్నారని విమర్శించారు.

కొండా సురేఖ ఏ శాఖకు మంత్రో గుర్తుంచుకోవాలని హితవు పలికారు. జైశ్రీరామ్ అంటే కొండంత బలం వస్తుందని, కానీ అనుచితంగా మాట్లాడితే మంత్రి పదవి ఊడిపోతుందని ముఖ్యమంత్రి ఆమెకు చెప్పాలని సూచించారు. కొండా సురేఖ ఆ వ్యాఖ్యలు చేసినందుకు ఏం చర్యలు తీసుకున్నారని ముఖ్యమంత్రిని ప్రశ్నించారు. తెలంగాణలో దేవాదాయ శాఖ భూముల కబ్జాలపై ఆమె దృష్టి సారించాలని కోరారు.

హైదరాబాద్‌లోని పాతబస్తీలో దేవుడి భూములను మజ్లిస్ పార్టీ నాయకులు కబ్జాలు చేశారని ఆరోపించారు. దేవాదాయ శాఖ అధికారులు ఆ పార్టీ నేతలతో కుమ్మక్కై కమీషన్లు తీసుకుంటున్నారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి

# వివేకానంద నగర్ డివిజన్ పరిధిలో పరిశుభ్రతకు పెద్దపీట

## రామకృష్ణ వీధిలో భారీ స్వచ్ఛత కార్యక్రమం -- మట్టి దిబ్బలు, చెత్త తొలగింపు

### రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు జనంపల్లి పురేందర్ రెడ్డి



**కూకట్ పల్లి, మే 07 (ప్రభాత సూర్య) :** శేరిలింగంపల్లి నియోజకవర్గం, వివేకనంద నగర్ డివిజన్ పరిధిలోని రామకృష్ణ వీధిలో కాలనీ అభివృద్ధి, పరిశుభ్రత కోసం కాలనీ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక శుభ్రత కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు జనంపల్లి పురేందర్ రెడ్డి నేతృత్వంలో మున్సిపల్ ట్రాక్టర్ సహాయంతో రోడ్లపై పేరుకుపోయిన మట్టి కుప్పలు, రాళ్లు, చెత్త చెదారం, పాత పురాతన వస్తువులు పూర్తిగా తొలగించి కాలనీ అంతటా పరిశుభ్ర వాతావరణాన్ని కల్పించారు. కాలనీలోని ప్రధాన వీధులు, అంతర్గత రోడ్లపై మిగిలిపోయిన మట్టి దిబ్బలను పూర్తిగా తొలగించి రోడ్లను శుభ్రంగా మార్చడం పట్ల స్థానిక కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. పరిశుభ్రమైన కాలనీ నిర్మాణమే తమ లక్ష్యమని కమిటీ సభ్యులు తెలిపారు.ఈ సందర్భంగా అధ్యక్షులు జనంపల్లి పురేందర్ రెడ్డి మాట్లాడుతూ కాలనీలో డ్రైనేజీ సమస్యలు, మంచినీటి ఇబ్బందులు, వీధి దీపాల సమస్యలు లేదా ఇతర పౌర సమస్యలు ఏవైనా ఉంటే వెంటనే కమిటీ సభ్యులకు తెలియజేయాలని కోరారు. సమస్యల పరిష్కారానికి కమిటీ శక్తివంచన లేకుండా కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. అలాగే కాలనీవాసులకు ముఖ్యంగా ప్రతి ఒక్కరూ తమ ఇంటి ముందు రోడ్లను పరిశుభ్రంగా ఉంచాలని, చెత్త చెదారం రోడ్లపై వేయకుండా బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. ఎవరైనా నిర్లక్ష్యంగా రోడ్లపై చెత్త వేస్తే మున్సిపల్ అధికారులు, కాలనీ కమిటీ సభ్యులు కఠిన చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు. కాలనీ అభివృద్ధి, పరిశుభ్రత, ప్రజల ఆరోగ్యం కోసం అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు.

# తేమ, తాలు , తరుగు పేరుతో రకరకాలుగా క్వింటాలుకు రెండున్నర కిలోల నుండి నాలుగున్నర కిలోల వడ్లను తీయడం విరమించుకోవాలని

**ఐకేపీ సెంటర్లలో, మార్కెట్ కేంద్రాలలో రైతులకు ధాన్యం నిలువ కోసం షెడ్లు, టార్పాల్లు, తాగడానికి నీళ్ల ఏర్పాటు చేయాలని**

**ఐకేపీ కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని వెంటనే కాంటాలు వేసి, మిల్లులకు తరలించాలి**

**సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్. వీరయ్య డిమాండ్.**



**భువనగిరి, మే 07(ప్రభాత సూర్య ):** తేమ, తాలు, తరుగు పేరుతో క్వింటాలుకు రెండున్నర కిలోల నుండి నాలుగున్నర కిలోల వడ్లను రైతుల నుండి దండుకోవడాన్ని విరమించుకోవాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్. వీరయ్య డిమాండ్ చేశారు. ఐకేపీ సెంటర్లలో, మార్కెట్ కేంద్రాలలో రైతులకు ధాన్యం నిలువ కోసం షెడ్లు, టార్పాల్లు(కవర్లు), తాగడానికి నీళ్ల ఏర్పాటు చేయాలని వారు ప్రభుత్వానికి సూచించారు. గురువారం భువనగిరి మండల పరిధిలోని అనాజిపురం గ్రామంలోని ఐకేపీ కేంద్రాన్ని సీపీఎం నాయకత్వంతో కలిసి సందర్శించిన అనంతరం అక్కడున్న రైతులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్న అనంతరం వీరయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఒక్క గింజ కూడా వదలకుండా కొనుగోలు చేస్తామని రైతులెవ్వరు కూడా భయపడవద్దని బాధపడవద్దని ధైర్యంగా ఉండమని ఊకదంపుడు ముచ్చట్లు చెప్తున్నారని అన్నారు. మరి నిన్న మొన్న అకాల వర్షాలతో పెద్ద ఎత్తున రైతులు వరి ధాన్యం తడిసి ఇబ్బందులు పడుతుంటే ఒక్క మంత్రి కూడా రైతు మార్కెట్ కేంద్రాలను ఎందుకు సందర్శించలేదని ప్రశ్నించారు. అధికారులేమొ ఒక దిక్కు రైతులను భయపడొద్దు అని చెప్తున్నారు మరి వానలో ధాన్యం తడిసి మొలకలు వస్తా ఉంటే రైతులు భయపడకుండా బాధపడకుండా ఎట్లా ఉంటారని అన్నారు. ఎర్రటి ఎండలో తమకుప్ప దగ్గర రైతులు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎట్లా కూర్చుంటారని కనీసం ఆయా మార్కెట్లో నిలువ నీడవలేక, తాగడానికి మంచి నీరు లేక కనీస సౌకర్యాలు కూడా లేకుండా వానొస్తే ధాన్యం తడవకుండా మొలకెత్తకుండా నిల్వ చేయడానికి షెడ్యూల్ ఏర్పాటు ప్రభుత్వము ఏర్పాటు చేయాలి కదా అని ప్రశ్నించారు. ఐకెపి సెంటర్ అంటున్నారు కానీ ఎక్కడ ఐకెపి సెంటర్ కనబడటం లేదు ఎవరిదో భూమి ఆ భూమి మీద రైతులు ధాన్యం కుప్పలు పోసుకుంటున్నారు. దీనికి ఐకెపి సెంటర్ అని పేరు ఎట్లా పెడతారని ప్రశ్నించారు. ఒక గ్రౌండ్ ఏర్పాటు చేసి పెద్ద పెద్ద షెడ్లు నిర్మాణం చేసి ధాన్యం పెట్టుకునే అవకాశాన్ని కల్పించి, అందులో రైతులకు అన్ని వసతులు కల్పించినప్పుడే ఐకేపీ సెంటర్ అంటే అర్థం ఉంటుందని తెలిపారు. ధాన్యమం మార్కెట్టుకు తెచ్చినప్పుడు వాటిని నిల్వ చేయడానికి వర్షమొస్తే పైనుండి కప్పడానికి టార్పాలు(పట్టాలు) ప్రభుత్వం ఇవ్వకపోవడం వల్ల ఒక్కొక్క రైతు ఒక్క పంటకు మూడు వేల నుండి ఆరు వేల రూపాయల వరకు కిరాయిలు చెల్లిస్తున్నారని అన్నారు. ఒక్కసారి వడ్లు తెచ్చి మార్కెట్లో కుప్ప పెడితే నెల రోజులకు పైగా సీరియల్ వచ్చేవరకు పడుతుందని ఆ నెల రోజులపాటు రైతులు ఆకాశం వైపు చూసి ఏడవాలో నవ్వాలో దిక్కుతోచని పరిస్థితిలో ఉంటూ ఎప్పుడు వానొస్తదో అనే భయంతో బతుకుతవలసి పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వెలిబుచ్చారు. కానీ ప్రభుత్వము రైతులకు భరోసా కల్పించి మార్కెట్ కి వచ్చిన ధాన్యాన్ని వెనువెంటనే కాంటవేసి లారీలకు ఎత్తి మిల్లులకు ఎందుకు తీసుకపోవడం లేదని అన్నారు. చాలా చోట్ల కాంటవేసిన ధాన్యం కూడా లారీకి ఎక్కించడం వాటిని మిల్లులకు తీసుక పోకపోవడం పరిపాటిగా మారిందని అన్నారు. మిల్లుకు పోయేవరకు ధాన్యం రక్షణ బాధ్యత రైతుదే అని చెప్పడం ఎట్లా కరెక్ట్ అని అన్నారు. ప్రాణాలను పణంగా పెట్టి పంటను పండించుకునే దుస్థితి ఎప్పటికీ రైతులకు రాష్ట్రంలో ఉన్నదని అన్నారు. ఎప్పుడైతే రైతుల సమస్యలు పరిష్కారం అవుతాయో అప్పుడూ మన రాష్ట్రం బాగుపడుతుందని తెలిపారు. రాష్ట్రంలో రైతులు సమస్యల సుడిగుండం నుండి ఎప్పుడు ఘట్టెకుతాడని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కేవలం రైతు భరోసా ఇస్తున్నామని చెప్పి మిగిలిన సమస్యలు పట్టించుకోక పోవడం వల్ల ఈరోజుకు రైతు కుటుంబాలు రోడ్డు పాలవుతున్నాయని అన్నారు. ప్రభుత్వం రైతుల విషయంలో బాధ్యతరహితంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. ప్రభుత్వం మాటలు చెప్పడం కాకుండా చేతల్లో పని చూపించాలని చెప్పారు. ఇప్పుడున్న ఆధునిక సమాజంలో సరిపడా లారీలు, మిల్లులు ఉన్న 30 నుండి 40 రోజులు వరకు రైతుల ధాన్యం కొనుగోలు కోసం ఎదురుచూసే పరిస్థితి వస్తుందని ప్రశ్నించారు. ఈ పరిస్థితి నుండి బయటపడేసి రైతులకు పూర్తి భరోసా కల్పించే విధంగా ప్రభుత్వమే బాధ్యత తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల ఒక్క రూపాయి కూడా రైతు నష్టపోకుండా చూడాలని, రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించే విధంగా ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలని సూచించారు. రైతులు ఐకేపీ, మార్కెట్ కేంద్రాలలో ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున పోరాటాలు చవిచూడవలసి వస్తుందని వీరయ్య ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ్మా, మండల కార్యదర్శి పల్లెర్ల అంజయ్య, మండల కార్యదర్శివర్గ సభ్యులు ఏదునూరి మల్లేశం, మండల నాయకులు గునుగుంట్ల శ్రీనివాస్, గ్రామ సర్పంచ్ రాయపురం సురేష్, మండల నాయకులు పాండాల మైసయ్య, జిట్ట అంజిరెడ్డి, శాఖ కార్యదర్శి కొడాలి కృష్ణ, నాయకులు పిట్టల వెంకటేష్, యండి.రఫీక్, గంగదారి భాను, రైతులు పన్నాల నరెందర్ రెడ్డి, బొల్లెపల్లి రామచంద్రం, గోగు పోషయ్య, బోయపల్లి దామోదర్ రెడ్డి, పిట్టల చంద్రయ్య, గడుసు నరేష్, శ్రీరాం చంద్రకళ, గోగు మంగమ్మ, బొల్లెపల్లి మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

# సాగర్ రోడ్డుపై డివైడర్లను తొలగించకుంటే ప్రత్యక్ష కార్యాచరణ: మాజీ ఎమ్మెల్యే రంగారెడ్డి

**ప్రజలకు అసౌకర్యంగానున్న డివైడర్లను తొలగించాలి అఖిలపక్షం ఏకగ్రీవ తీర్మానం**





**మిర్యాలగూడ మే 7:-( ప్రభాత సూర్య):** వాణిజ్య కేంద్రమైన మిర్యాలగూడ పట్టణంలోని సాగర్ రోడ్డుపై ప్రజలకు అసౌకర్యంగా నిర్మించిన డివైడర్లను తొలగించకుంటే ప్రత్యక్ష కార్యాచరణకు పూనుకోవాలని దానికి తానే ముందుంటానని మాజీ ఎమ్మెల్యే, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి తెలిపారు. గురువారం స్థానిక వైష్ణవి హోటల్ లో సాగర్ రోడ్డుపై నిర్మితమైన డివైడర్లను తొలగించేందుకు సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్ అధ్యక్షతన అఖిలపక్షం సమావేశంలో రంగారెడ్డి మాట్లాడుతూ అభివృద్ధిని తాము అడ్డుకోమని ఆ పేరుతో ప్రజలకు అసౌకర్యంగా ఉన్న వాటిని తొలగించాలని తాము కోరుతున్నట్లు తెలిపారు. మిర్యాలగూడ పట్టణానికి సమీప ప్రాంతాల నుండి వేలాలాదిమంది వ్యాపార, తదితర పనులకు ప్రజలు వస్తుంటారని నేపథ్యంలో రోడ్డు దాటడానికి అడ్డంగా ఇటీవల నిర్మించిన డివైడర్లు ఆటంకంగా ఉన్నాయని వారు అన్నారు. పట్టణం నుండి జాతీయ రహదారి వెళ్లడం సాకుతో డివైడర్లను ఏర్పాటు చేశామనడం సమంజసం కాదన్నారు. సమస్య తీవ్రంగా ఉన్నందువల్ల ప్రజాప్రతినిధులు ఎంపీ, ఎమ్మెల్యే చొరవ తీసుకుని పరిష్కారం చేయాలని కోరారు. ముఖ్యంగా ఫర్టిలైజర్ బజార్ కు వెళ్లే మార్గంలోని డివైడర్ను అదేవిధంగా నందిపాడు రోడ్డు, గవర్నమెంట్ హాస్పిటల్ రోడ్డు, సాయిబాబా దేవాలయానికి వెళ్లే రోడ్డు, పోలీస్ స్టేషన్ కు వెళ్లే రోడ్డులకు అడ్డం గా ఉన్న డివైడర్లను తొలగించాలని వారు కోరారు. లేనియెడల తామే గుణపంతో పై పేర్కొన్న స్థలాల వద్ద అడ్డంగా ఉన్న డివైడర్ను తొలగిస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ పట్టణంలో హైవే ఏర్పాటు వల్ల డివైడర్లు ఏర్పాటు చేయవలసి వచ్చిందని అయినా ప్రజలకు ఇబ్బందికరంగా ఉన్న ఐదు ప్రాంతాలలో వాటిని తొలగించే విధంగా ఎమ్మెల్యేగా మాట్లాడి వాటిని తొలగించేందుకు తన వంతుగా కృషి చేస్తానన్నారు. లేనిపక్షంలో తానే ముందుగా గడ్డపారతో తొలగించేందుకు అఖిలపక్షంతో సహకరిస్తానన్నారు. డివైడర్లను తొలగించాలి ముక్తకంఠంగా తీర్మానించిన అఖిలపక్షంసాగర్ రోడ్డుపై ప్రజలకు అసౌకర్యంగా నిర్మితమైన డివైడర్లను తొలగించాలని గురువారం జరిగిన అఖిలపక్ష సమావేశం ముక్తకంఠంగా తీర్మానించింది. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డి.మల్లేష్ అధ్యక్షతన జరిగిన అఖిలపక్ష సమావేశం జరిగింది. సమావేశంలో కాంగ్రెస్ తో సహా మిగిలిన అన్ని పార్టీల నాయకులు పాల్గొన్నారు. వారందరూ డివైడర్లను పట్టణంలో ఐదు ప్రాంతాలలో తొలగించాలన్నారు. ముఖ్యంగా సాగర్ రోడ్డుపై గల నాలుగు ప్రాంతాల్లోని డివైడర్లను తొలగించాలని ప్రజల పక్ష నాయకులు కోరారు. ప్రజా ప్రతినిధులు ప్రజలకు అవసరమే అయినా పనులు చేయాలి తప్ప ప్రజలకు ఇబ్బంది కలిగించే పనులు చేయొద్దని ప్రజా సొమ్ము దుర్వినియోగం చేయొద్దని అఖిలపక్ష నాయకులు కోరారు. సమావేశంలో సిపిఎం నాయకులు వీరేపల్లి వెంకటేశ్వర్లు మల్లు గౌతంరెడ్డి, భావండ్ల పాండు సీపీఐ నాయకులు బంటు వెంకటేశ్వర్లు, బిఆర్ఎస్ కౌన్సిలర్ ఇలియాస్, బిజెపి నాయకులు చిలుకూరు శ్యాం, ఐఎంఎ నాయకులు డాక్టర్ మువ్వా రామారావు డాక్టర్ జె.రాజు, డాక్టర్ మల్సూర్, ఏంసిపిఐయు నాయకులు వస్కల మట్టయ్య, ఎంఐఎం నాయకులు సయ్యద్ ఫారూఖ్, టూప్రా నాయకులు నూకల జగదీష్చంద్ర ఐద్వా నాయకులు అరుణ, సామాజిక కార్యకర్తలు కస్తూరి ప్రభాకర్, ప్రముఖ వ్యాపారవేత్తలు నీలా మోహన్ రావు, పాండురంగయ్య, జవహర్ బాబు తదితరులు పాల్గొన్నారు.



# వడ్ల కొనుగోలు మార్కెట్ లను సందర్శించిన సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి

**సంస్థాన్ నారాయణపురం, మే 07(ప్రభాత సూర్య ):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రంలో వడ్ల కొనుగోలు కేంద్రాలను సందర్శించడం జరిగింది. ప్రభుత్వపరంగా ధాన్యాన్ని కొనుగోలు చేసి మిల్లర్లకు విక్రయిస్తున్న పరిస్థితులను తెలుసుకొని వేగవంతంగా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని అధికారులను కోరనైనది. దీనిపై మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి కీ, జిల్లా కలెక్టర్, ఇతర అధికారులతో ఎప్పటికప్పుడు ఫోన్లలో మాట్లాడి వరి ధాన్యం కొనుగోలు వేగవంతం చేసి విధముగా రైతులకు ఇబ్బంది కలగకుండా రోజుల తరబడి నిరీక్షణ చేయకుండా త్వరితగతిన కొనుగోలు చేయాలని ఆదేశాలు జారీ చేసినారు. ఎండ తీవ్రత తీవ్రంగా ఉన్నందున వరి ధాన్యం కొలుగోలు ప్రాంతంలో రైతులకు మంచినీటి వసతి నీడ వసతులు కల్పించాలని నిర్వాహకులను ఆదేశించడం జరిగింది. వరి ధాన్యశీ ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని గ్రామ సర్పంచ్ మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు మందుగుల బాలకృష్ణ,వెంకంబావి తండ సర్పంచ్ పానుగోతు వసంత బాలు నాయక్, కంకణాలగూడెం మాజీ సర్పంచ్ సరిపల్లి శైలజ సత్యనారాయణ , వార్డ్ మెంబర్లు సూరపల్లి వెంకటేశం, మాజీ వార్డ్ నెంబర్ ఎండి ముస్తఫా ఖాన్, కాంగ్రెస్ నాయకులు గునిగంటి రాజు గౌడ్,అందే యాదయ్య యాదవ్, ఉప్పల రాజయ్య, కరెంటుతు లచ్చు నాయక్, సుర్వీ ముత్యాలు గౌడ్, బద్దుల యాదగిరి యాదవ్, ఎండి హర్షద్ ఎండి కురిసి, జక్కిడి వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కురుమ కార్పొరేషన్ ఏర్పాటు చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య చిత్రపటానికి పాలాభిషేకం...



**ఆలేరు మే 7 ప్రభాత సూర్య:** ఆలేరు పట్టణ కేంద్రంలో గురువారం రోజున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కురుమ కార్పొరేషన్ ఏర్పాటు చేసినందుకు వారి చిత్రపటానికి, మరియు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య కు పాలాభిషేకం చేసిన కురుమ సంఘం నాయకులు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కురుమలను గుర్తించి కురుమల ఆత్మగౌరాన్ని పెంచడానికి కురుమ కార్పొరేషన్ ఏర్పాటు చేసినందుకు ధన్యవాదాలు తెలుపుతున్నామని అన్నారు. కురుమ కార్పొరేషన్ ఏర్పాటు కై అనునిత్యం కృషిచేసి అసెంబ్లీలో కురుమల ఆత్మ గౌరవం కోసం తన గొంతు గా వినిపించి కార్పొరేషన్ ఏర్పాటుకు కృషి చేసిన ఎమ్మెల్యేకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో కురుమ సంఘం అధ్యక్షులు చిన్నం యాదగిరి, మాజీ అధ్యక్షులు ఎగ్గిడి శ్రీశైలం, కురుమ సంఘం నాయకులు బీజన భాస్కర్, మల్లెల శ్రీకాంత్, జూకంటి సంపత్, జెట్ట సిద్దులు, చిమ్మి అబ్బ సాయిలు, పేరపు రాములు, కూళ్ల నరసింహులు, పిక్క శ్రీనివాస్, కొన్నే మల్లేష్, యాదగిరి,ఎగ్గిడి శ్రీనివాస్, పరపు సిద్ధులు, బండ శీను, పేరపు సిద్ధులు, బుడిగే సిద్ధులు, మచ్చ సాయి మల్లయ్య, బల్ల శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

# వడ్డీలేని రుణాలు రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంపు: తెలంగాణ ప్రభుత్వం శుభవార్త

**మహిళా స్వయం సహాయక బృందాలకు వడ్డీలేని రుణాలు**

**రూ.10 లక్షల రుణానికి వడ్డీని ప్రభుత్వమే భరిస్తుందన్న సీతక్క**



మహిళా సంఘాలకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. మహిళా స్వయం సహాయక బృందాలకు ఇస్తున్న వడ్డీలేని రుణాలను రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచుతున్నట్లు మంత్రి సీతక్క వెల్లడించారు. స్వయం సహాయక బృందాలు తీసుకునే రూ.10 లక్షల రుణానికి సంబంధించిన వడ్డీని ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు.మహిళా స్వయం సహాయక బృందాలకు ఇచ్చే బ్యాంకు వార్షిక రుణ ప్రణాళికను ఈరోజు ప్రజాభవన్‌లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి మంత్రి సీతక్క హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, 2025-26 ఆర్థిక సంవత్సరంలో స్వయం సహాయక బృందాల సభ్యులకు రూ.25,228.89 కోట్ల బ్యాంకు రుణాలు ఇచ్చినట్లు సీతక్క తెలిపారు.మహిళా సంఘాల రుణాల వడ్డీ కోసం రూ.2,500 కోట్లు వ్యయం చేస్తామని వెల్లడించారు. 'మహిళా ఉన్నతి-తెలంగాణ ప్రగతి' అనే నినాదంతో ప్రభుత్వం పని చేస్తోందని అన్నారు. మహిళలు పేదరికం నుంచి బయటపడినప్పుడే అభివృద్ధి పరిపూర్ణమవుతుందని వ్యాఖ్యానించారు. కోటిమంది మహిళలను కోటీశ్వరులుగా చేసే సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోందని సీతక్క తెలిపారు.

## ఉపరితల ద్రోణి.. రెండు తెలుగు రాష్ట్రాలకు

# 3 రోజుల పాటు వర్ష సూచన

### కొన్ని రోజులుగా తెలుగు రాష్ట్రాల్లో నమోదవుతున్న గరిష్ఠ ఉష్ణోగ్రతలు

### ద్రోణి ప్రభావంతో మూడు రోజుల పాటు వర్షాలు పడతాయని వెల్లడించిన వాతావరణ శాఖ

### ఉరుములతో కూడిన వర్షాలు పడే అవకాశం

తెలుగు రాష్ట్రాల్లో భానుడి భగభగలతో అల్లాడుతున్న ప్రజలకు వాతావరణ శాఖ ఉపశమనాన్ని కలిగించే వార్త చెప్పింది. కర్ణాటక నుండి రాయలసీమ, తెలంగాణ మీదుగా ఏర్పడిన ద్రోణి ప్రభావంతో రానున్న మూడు రోజుల పాటు రెండు రాష్ట్రాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. ఈ వాతావరణ మార్పుల వల్ల గత కొన్ని రోజులుగా నమోదవుతున్న గరిష్ఠ ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గి, వాతావరణం చల్లబడే అవకాశం ఉంది.తెలంగాణ విషయానికి వస్తే... జోగులాంబ గద్వాల, ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్గొండ, మెదక్, ఖమ్మం, నిజామాబాద్ జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఎక్కువగా ఉంది. ఈ జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో పాటు బలమైన ఈదురుగాలులు వీచే ప్రమాదం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. అకాల వర్షాల నేపథ్యంలో ఉరుములు సంభవించే సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, బయట తిరగవద్దని అధికారులు సూచించారు.ఆంధ్రప్రదేశ్‌లో కూడా దీని ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. ఉత్తర కోస్తా, దక్షిణ కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. తీర ప్రాంతాల్లో ఉరుములతో కూడిన జల్లులు పడవచ్చని వాతావరణ కేంద్రం అంచనా వేసింది. ముఖ్యంగా రైతులు తమ కోతకు వచ్చిన పంటలను కాపాడుకోవడానికి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ధాన్యం తడవకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులు కోరారు.

## కొండా సురేఖ వ్యాఖ్యలు అభ్యంతరకరం

### ఎండోమెంట్ మంత్రిగా ఇలానేనా వ్యాఖ్యానించేది

### మండిపడ్డ గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్

హైదరాబాద్: జై శ్రీ రామ్ అంటే పై నుంచి పైసలు పడతాయా అని మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలపై గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎండోమెంట్ మంత్రి అంటే దేవుడికి మినిస్టర్‌లాగా ఉండాలని.. కానీ కొండా సురేఖ ఏ శాఖకు మంత్రి..? అని ప్రశ్నల వర్షం కురిపించారు. గురువారం హైదరాబాద్ లో రాజాసింగ్ మాట్లాడారు. రేవంత్‌రెడ్డి గతంలో ఏబీవీపీలో ఉన్నప్పుడు జై శ్రీరాం అన్నారని ప్రస్తావించారు. మరి ఇప్పుడు తన మంత్రికి జై శ్రీరాం గురించి నేర్పించలేదా..? అని నిలదీశారు. జై శ్రీరాం అంటే కొండంత బలం వస్తోందని...కానీ అనుచితంగా మాట్లాడితే మంత్రి పదవి పోతుందని ఆమెకు చెప్పాలని అన్నారు. తెలంగాణలో దేవుడి భూముల అమ్మకాలు, కబ్జాలు ఎలా జరుగుతున్నాయో చూస్తున్నామని అన్నారు. ఈ విషయంలో కొండా సురేఖ ఎలాంటి చర్యలు చేపట్టారు...? అని రాజాసింగ్ ప్రశ్నించారు. హైదరాబాద్ ఓల్డ్ సిటీలో దేవుడి భూములను ఎంఐఎం నేతలు కబ్జా చేశారని ఆరోపించారు. దేవాదాయ శాఖ అధికారులు వారితో కుమ్మక్కై కమిషన్లు తీసుకుంటున్నారని ధ్వజమెత్తారు. రేవంత్‌రెడ్డి సర్కార్‌కి దేవాలయాల అభివృద్ధి మీద ధ్యాస లేదని ఆగ్రహించారు. ఎంఐఎం నేతలిచ్చే కమిషన్ల మీదనే ఈ మంత్రికి ధ్యాస ఉందని ఎద్దేవా చేశారు. రాముడి నామాన్ని ఎదిరించడానికి సాహసించేవారు.. ఎవరైనా గాల్లో కొట్టుకుపోతారని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి, దయచేసి మీ దేవాదాయ శాఖ మంత్రిని పిలిపించి రాజీనామా చేయించాలని హితవు పలికారు. లేకపోతే మీరు కూడా కేసీఆర్ లాగా మునిగిపోతారని రాజాసింగ్ విమర్శించారు.

## పొన్నంకు మంత్రి నితిన్ గడ్కరీ ప్రశంసలు

న్యూఢిల్లీ:తెలంగాణ రవాణా శాఖ పనితీరును కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ ప్రశంసించారు. రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కేంద్రమంత్రి అభినందనలు తెలిపారు. మంత్రి పొన్న ప్రభాకర్‌ని ప్రశంసిస్తూ నితిన్ గడ్గరీ గురువారం లేఖ రాశారు. చెక్‌పోస్టుల రద్దు నిర్ణయంపై ప్రశంసలు కురిపించారు. వాహన్ సమీకరణపై కేంద్రమంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆటోమేటెడ్ డ్రైవింగ్ టెస్టింగ్ ట్రాక్‌లను ప్రశంసించారు. రోడ్డు భద్రత చర్యల్లో తెలంగాణ ముందంజలో ఉందని కొనియాడారు. డిజిటల్ గవర్నెన్స్‌లో తెలంగాణపై ప్రశంసలు కురిపించారు. ప్రజా అవగాహన కార్యక్రమాలు అభినందనీయమని నితిన్ గడ్కరీ పేర్కొన్నారు.

## తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారం

### ఏకసభ్య కమిషన్ నివేదికపై కమిటీ

అమరావతి:తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో వాడే నెయ్యి కల్తీ వ్యవహారంపై ఏకసభ్య కమిషన్ నివేదికపై చర్యలు తీసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం కమిటీని నియమించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ సాయి ప్రసాద్ జీవో నంబర్ 900ను జారీ చేశారు. ఏకసభ్య కమిషన్ నివేదికలో బయటపడిన అంశాలు, సిఫార్సులను వివరంగా అధ్యయనం చేయాలని ఆదేశించింది. పాలనాపరంగా అధికారులపై తీసుకోవాల్సిన క్రమశిక్షణ చర్యలు, న్యాయపరంగా ముందుకు వెళ్లాల్సిన అంశాలపై సూచనలు చేయాలని కమిటీకి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఏకసభ్య కమిషన్ నివేదికలోని నిర్ణీత కాల వ్యవధిలో అమలు చేయాల్సిన అంశాలను సూచించాలని ప్రభుత్వం తెలిపింది. ఈ సిఫార్సులను అమలు చేసేందుకు తగిన పర్యవేక్షణ యంత్రాంగం ఏర్పాటు చేయడం వంటి అంశాలపై కమిటీ సూచనలు ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. కమిటీ తన నివేదికను వారం రోజుల్లో ప్రభుత్వానికి సమర్పించాలని జీవోలో స్పష్టంగా సూచించింది.

## ఏపీకి ఎవరు వస్తున్నారో తెలుసా..?

### లోకేశ్ ఆసక్తికర పోస్ట్

అమరావతి: సోషల్ మీడియా ఎక్స్‌లో మంత్రి నారా లోకేశ్ ఓ ఆసక్తికర వీడియోను పోస్ట్ చేశారు. 'ఏపీకి ఎవరు వస్తున్నారో తెలుసా..?' అంటూ ఓ వీడియోను పోస్ట్ చేశారు. వీడియోను పోస్ట్ చేసిన లోకేశ్.. అందులో నీట్‌గా టక్ వేసుకుని, ట్రెండీ కళ్లజోడు పెట్టుకుని.. న్యూ లుక్‌లో రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్(బు÷–లలెట్) డ్రైవ్ చేసుకుంటూ వెళ్తున్నట్లు కనిపించారు. ప్రస్తుతం ఈ పోస్ట్ వైరల్ అవుతోంది. మంత్రి లోకేశ్ లుక్‌ను పరిశీలించిన నెటిజన్లు ఏపీకి ఎవరు వస్తున్నారో కనిపెట్టేశారు. రాయల్ ఎన్‌ఫీల్డ్ సంస్థ ఆంధ్రప్రదేశ్‌కు రాబోతున్నట్లు అంచనా వేశారు.

# మిర్యాలగూడ పట్టణం గుండా కోదాడ జడ్చర్ల జాతీయ రహదారి వద్దు

## మంత్రులకు ఎమ్మెల్యే బిఎల్ఆర్ వినతిపత్రాలు







**మిర్యాలగూడ , మే 7:-( ప్రభాత సూర్య ):** మిర్యాలగూడ పట్టణం నుండి వెళ్తున్న కోదాడ – జడ్చర్ల జాతీయ రహదారిని మళ్లించి, ట్రాఫిక్ సమస్యల నుండి పట్టణ ప్రజలకు ఉపశమనం కలిగించాలని రాష్ట్ర పౌరసరఫరాల, నీటిపారుదల మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి, రోడ్డు భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఇంచార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్, జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ వినతిపత్రాలు సమర్పించారు.మిర్యాలగూడ నియోజకవర్గ కేంద్రమైన మిర్యాలగూడ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజల తరపున సమస్యను దృష్టికి) తీసుకువస్తున్నామన్నారు. గత ప్రభుత్వ హయాంలో మిర్యాలగూడ పట్టణం గుండా వెళ్లే రహదారిని జాతీయ రహదారిగా ప్రకటించిన సమయంలో, ప్రతిపాదిత 100 ఫీట్ల విస్తరణకు బదులుగా కేవలం 84 ఫీట్లకు మాత్రమే పరిమితం చేసి రోడ్డు విస్తరణ పనులు చేపట్టారన్నారు. మిర్యాలగూడ డివిజన్ ప్రధాన వాణిజ్య కేంద్రం కావడం వల్ల, పట్టణం లోపలి నుండి నిత్యం సుమారు 50,000 మందికి పైగా ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారన్నారు. స్థానిక రద్దీకి తోడు, ఇప్పుడు జాతీయ రహదారి ట్రాఫిక్ భారీ వాహనాలు కూడా పట్టణం లోపలి నుండే వెళ్లడం వల్ల నిత్యం ట్రాఫిక్ జామ్ ఏర్పడి అటు ప్రజలకు, ఇటు ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. నివాస ప్రాంతాలు వ్యాపార సముదాయాల నుండి జాతీయ రహదారి వెళ్లడం వల్ల ప్రమాదాల ముప్పు కూడా ఎక్కువగా పొంచి ఉందని రహదారి వెడల్పు తక్కువగా ఉండటం, జనాభా రద్దీ ఎక్కువగా ఉండటం వల్ల ట్రాఫిక్ నియంత్రణ అధికారులకు సవాలుగా మారిందన్నారు. మంత్రి సానుకూలంగా స్పందించి, మిర్యాలగూడ పట్టణ ప్రజల భద్రతను, సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకొని, జాతీయ రహదారిని పట్టణ బయటి నుండి మళ్లించేలా చర్యలు తీసుకోవాలని, ప్రస్తుత పట్టణ రహదారిని స్థానిక అవసరాలకు మాత్రమే పరిమితం చేయాలని మిమ్మల్ని కోరారు.

# పోరాట వారసత్వాన్ని కొనసాగిస్తూ మరణించిన కామ్రేడ్ వగ్గు మల్లన్న ప్రజా ఉద్యమాలలో,పోరాట దారుల్లో ఎర్ర జండా రెపరెపలల్లో మనకు కనిపిస్తాడు,పోరాట పథమై వినిపిస్తాడు..

## ఆర్.జనార్ధన్,జిల్లా కార్యదర్శి. సీపీఐ ఎం.ఎల్ న్యూడెమోక్రసీ






**ఆలేరు మే 7 ప్రభాత సూర్య:** దోపిడీ, పీడనలకు గురవుతున్న పేదలు, కష్టజీవులు,కార్మికులు, రైతాంగం,మొత్తం శ్రామిక వర్గం విముక్తి కోసం సాగిన పోరాటంలో పాల్గొని మరణించిన కామ్రేడ్ వగ్గు మల్లయ్య(మల్లన్న) ప్రజా ఉద్యమాలలో,పోరాట దారుల్లో,ఎగిరే ఎర్రని జండా రెపరెపలల్లో మనకు కనిపిస్తాడు, పోరాట పథమై వినిపిస్తాడని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి ఆర్.జనార్ధన్ అన్నారు. మే 7 న యాదగిరిగుట్ట మండలం కాచారం గ్రామంలో సీపీఐ ఎం.ఎల్ న్యూడెమోక్రసీ జిల్లా సీనియర్ నాయకుడు కామ్రేడ్ వగ్గు మల్లన్న సంతాప సభ సీపీఐ ఎం.ఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జరిగింది. సంతాప సభ కు పార్టీ జిల్లా నాయకుడు కామ్రేడ్ బేజాడి కుమార్ అధ్యక్షత వహించాడు. కామ్రేడ్ మల్లన్న స్మృతికి రెండు నిమిషాలు మౌనం పాటించి ఘనంగా విప్లవ జోహార్లు తెలిపారు. అనంతరం జరిగిన సభలో జనార్ధన్ మాట్లాడుతూ, కామ్రేడ్ వగ్గు మల్లన్న సామాన్య మధ్యతరగతి కుటుంబంలో పుట్టినప్పటికి సీపీఐ ఎం.ఎల్ న్యూడెమోక్రసీ లో సాహసోపేతమైన పాత్రను పోషించాడని,అణగారిన వర్గాల ప్రజలకు అన్ని విధాల స్వేచ్ఛ,సమానత, సౌకర్యాలు ఉండాలని దోపిడీ పీడన నశించాలని పోరాడిన పార్టీ నాయకత్వానికి,ప్రజలకు అండగా నిలిచాడని అజ్ఞాతవాసం లో ఉన్న అన్నలకు అన్ని తానై పార్టీ,ప్రజా ఉద్యమ అవసరాలు తీర్చాడని చెపుతూ మల్లన్న సేవలను కొనియాడారు.ఏ ఐ కె ఎం ఎస్ రాష్ట్ర అద్యక్షులు మామిడాల భిక్షపతి మాట్లాడుతూ,రైతాంగ పోరాటానికి మద్దతుగా ప్రత్యక్ష పోరాటంలో పాల్గొన్న కామ్రేడ్ వగ్గు మల్లన్న నిజాయితీ కలిగిన విప్లవ రైతు.కూలీ కార్యకర్తగా క్రియాశీలక పాత్రను పోషించాడని అన్నారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం రైతులను ఏ మాత్రం పట్టించుకోకుండా, ధాన్యానికి స్వామినాథన్ ఇచ్చిన కమిషన్ సిఫారసులను అమలు చేయడం లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఎం.ఎల్ న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి ఇక్కిరి సహదేవ్, ఏ ఐ కె ఎం ఎస్ జిల్లా అధ్యక్షులు కల్లెపు అడివయ్య,పార్టీ సీనియర్ నాయకుడు బాల్ రెడ్డి,మాజీ ఎంపీటీసీ ఎడ్ల రాంరెడ్డి వనజ, అరుణోదయ కళాకారులు ఇక్కిరి శ్రీనివాస్,ఆర్.ఉదయ్,పీ ఓ డబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు ఆర్.సీత, జిల్లా నాయకురాలు సుంకే సుగుణ,ఏ ఐ కె ఎం ఎస్ జిల్లా గౌరవాధ్యక్షులు మామిడాల సోమయ్య, ఐ ఎఫ్ టి యు జిల్లా అధ్యక్షులు పద్మ సుదర్శన్, ప్రధాన కార్యదర్శి గడ్డం నాగరాజు,ఏ ఐ కె ఎం ఎస్ జిల్లా నాయకుడు నేరేడు స్వామి,మామిడాల బాల మల్లేష్, చిర బోయిన కొమురయ్య, తమ్మడి అంజయ్య,వంగాల మధుసూదన్ రెడ్డి, వంగాల నర్సింహారెడ్డి, గడ్డం మంకయ్య,పీ వై ఎల్ జిల్లా అధ్యక్షుడు మారుజోడు సిద్దేశ్వర్, జిల్లా ప్రధాన కార్యదర్శి సాదుల శ్రీకాంత్,నాయకులు పైసా రాందాస్,యెర్రంబెల్లి ఐలయ్య,ఊరడి రామ చంద్రు, ఉచ్చతల మల్లేష్,అయిల యాకయ్య, వడ్ల కొండ బాలరాజు,తమ్మడి రమేష్,పెంద్యాల శ్రీను,బత్తుల రాజిరెడ్డి,కుర్రి మార్కండేయ,కడకంచి బీరయ్య,సుంచు రాములు తదితరులు పాల్గొన్నారు.

# పవన్ కల్యాణ్ చొరవ..


### వర్తనపల్లి శివాలయానికి టీటీడీ రూ. 55 లక్షలు మంజూరు!

### డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చొరవతో శివాలయ పునర్నిర్మాణం

### పాడేరు పర్యటనలో గ్రామస్థులకు హామీ ఇచ్చిన పవన్ కల్యాణ్

### ఆలయంతో పాటు కొత్త విగ్రహాలు, ధ్వజస్తంభం ఏర్పాటుకు ప్రణాళిక

ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చొరవతో అల్లూరి సీతారామరాజు జిల్లాలోని ఓ మారుమూల గ్రామంలో శిథిలావస్థకు చేరిన శివాలయానికి మహర్దశ పట్టనుంది. పాడేరు నియోజకవర్గంలోని వర్తనపల్లి గ్రామ శివాలయం పునర్నిర్మాణానికి తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) రూ. 55 లక్షల నిధులను మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.వివరాల్లోకి వెళ్తే, గత మార్చి 14న పవన్ కల్యాణ్ పాడేరు ప్రాంతంలో పర్యటించారు. ఈ సందర్భంగా వర్తనపల్లి గ్రామస్థుల కోరిక మేరకు, సుమారు మూడు దశాబ్దాల క్రితం నిర్మించి శిథిలావస్థకు చేరిన శివాలయాన్ని ఆయన సందర్శించారు. ఆలయ పునర్నిర్మాణానికి సహకరించాలని గ్రామస్థులు కోరగా, టీటీడీ సహకారంతో అభివృద్ధి పనులు చేపడతామని ఆయన అక్కడికక్కడే హామీ ఇచ్చారు.పర్యటన ముగిసిన వెంటనే పవన్ కల్యాణ్ ఈ విషయంపై టీటీడీకి లేఖ రాశారు. ఆయన విజ్ఞప్తి మేరకు టీటీడీ సాంకేతిక బృందం గ్రామంలో పర్యటించి అంచనాలు రూపొందించింది. ఈ నిధులతో శివాలయ పునర్నిర్మాణంతో పాటు సింహవాహనంతో కూడిన అమ్మవారి విగ్రహం, మూషిక వాహనంతో గణపతి, నెమలి వాహనంతో సుబ్రహ్మణ్యస్వామి విగ్రహాలను ఏర్పాటు చేయనున్నారు.



## శంషాబాద్ విమానాశ్రయం నుంచి తన నివాసం వరకు సాధారణ ట్రాఫిక్‌లో కాన్వాయ్

### ట్రాఫిక్ పూర్తిగా నిలిపివేయకుండా ఒకే లైన్‌లో వాహనాలను కదలడానికి అనుమతి

తన కాన్వాయ్ కోసం ప్రజలను ఇబ్బందిపెట్టవద్దని రేవంత్ రెడ్డి ఇటీవల ఆదేశాలు

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాన్వాయ్ శంషాబాద్ విమానాశ్రయం నుంచి జూబ్లీహిల్స్‌లోని ఆయన నివాసం వరకు సాధారణ ట్రాఫిక్‌లోనే ప్రయాణించింది. ఆయన కాన్వాయ్ కోసం ఎక్కడా ట్రాఫిక్‌ను నిలిపివేయలేదు. తన కాన్వాయ్ కోసం సామాన్యులను ఇబ్బంది పెట్టవద్దని, వాహనాలను ఆపవద్దని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డీజీపీకి ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే.ఈ క్రమంలో గురువారం ఆయన కాన్వాయ్ సాధారణ ట్రాఫిక్‌లో ప్రయాణించింది. విమానాశ్రయం నుంచి తన నివాసం వరకు సాధారణ ట్రాఫిక్‌లోనే వెళ్లడం గమనార్హం.

## ఎడిటోరియల్

ప్రజాస్వామ్యంలో నిరంకుశంగా ఉంటామంటే కుదరదు. ప్రజలు ఎన్నుకుంటే నేతలు..లేదంటే అంతే సంగతులు. భారత ప్రజాస్వామ్యంలో ఎవరైనా రాజ్యాంగ బద్దంగా ఉండాల్సిందే. కాదూకూడదంటే... కుదరదు. ఇటీవల ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు ముగిసి..ఫలితాలు కూడా వచ్చేశాయి, బెంగాల్లో బిజెపి అధికారం చేపట్టబోతోంది. తమిళనాడులో నటుడు విజయ్ స్థాపించిన టివికె పార్టీ అధికారం దక్కించు కుంది. ఇంతవరకు ఇవే పెద్ద మార్పులు. కేరళలో ఎల్‌డిఎఫ్ స్థానంలో యూడిఎఫ్ అధికారం కైవసం చేసుకుంది. అసోం, పాండిచ్చేరిల్లో పాత ప్రభుత్వాలే కొత్తగా కొలువుదీర బోతున్నాయి. ఈ క్రమంలో బెంగాల్లో గత పదేహేనేళ్ల మమతా బెనర్జీ పాలనలో అనేక అరాచకాలను చూశాం. తానూ బంగ్లాదేశ్‌లో లాగా ఓ దేశానికి రాణిని అని భ్రమిశారు. అడ్డూ అదుపులేకుండా అరాచకాలకు తెలేపారు. చొరబాటుదార్లకు గేట్లు తెరిచారు. ఆధార్ కార్డులు, రేషన్ కార్డులు ఇచ్చి వారిని పర్మినెంట్‌గా ఓటర్లను చేశారు. కానీ సర్ ప్రక్రియతో ఆమె ఆటలు సాగలేదు. అలాగే ఆమె తీరుతో ప్రజల్లో గూడుకట్టుకున్న ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ఓట్ల రూపంలో తమ తీర్పును తెలిపారు. 95 శాతం మంది, అందులో మహిళల క్యూలు కట్టి మమతను ఓడించారు. ప్రజల తీర్పును గౌరవించాల్సిన మమతా బెనర్జీ తాను ఓడిపోలేదని, రాజీనామా చేయలనని, బిజెపి వందసీట్లు చోరీ చేసిందని దగుల్బాజీ మాటలు మాట్లాడారు. అసోం, బెంగాల్లో ఓట్ చోరీ జరిగిందని రాహుల్ కూడ వంతపాడారు. మరి తమిళనాడు, కేరళలో ఓట్ చోరీ ఎదుకు జరగలేదో రాహుల్ చెప్పాలి. రాహుల్ ఓట్ చోరీ పేరుతో ఇంకా నాటకాలు ఆడితే ప్రజలు క్షమించరని గుర్తించాలి. విపక్షనేత కూడా మతిభ్రమించి మాట్లాడడం అలవాటు చేసుకున్నారు. మమత బెనర్జీ తాను ఇండియాలో ఉన్న వెస్ట్ బెంగాల్ ముఖ్యమంత్రిగా పనిచేశానని అనుకోవడం లేదు. బంగ్లాదేశ్‌లాగా తనది కూడా స్వతంత్ర రాజ్యం అనుకుంటున్నారు. అందుకే రాజ్యంగం విలువ తెలియకుండా మాట్లాడుతున్నారు .ఆ రాజ్యంగమే ఆమెను 15 ఏళ్లపాటు సిఎంగా మోసిందని గుర్తించడం లేదు. ఓటమితో మమతలో అసహనం పెరిగింది. ఏం మాట్లాడాలో తెలియడం లేదు. రాహుల్ ఓట్‌చోరీని సీట్ల చోరీతో పోల్చి మాట్లాడారు. పశ్చిమబెంగాల్ ఎన్నికల్లో బీజేపీ కుట్రలతోనే గెలిచిందని మమతా బెనర్జీ అంటున్నారు. బీజేపీకి ఈసీ ఏజెంట్‌గా మారిందని ఆక్షేపణ తెలిపారు. ఈ ఎన్నికలో ప్రధాన విలన్ ఎన్నికల సంఘమేనని విమర్శలు గుప్పించారు. 100పైగా సీట్లు లూటీ చేశారని, తాను ఎన్నికల్లో ఓడిపోలేదని చెప్పారు. అందువల్ల తాను రాజీనామా చేసే ప్రసక్తి కూడా లేదన్నారు. రాజ్‌భవన్‌కు వెళ్లనని, రాజీనామా చేయమని తనను ఎవరూ ఒత్తిడి చేయలేరని స్పష్టం చేశారు. పశ్చిమబెంగాల్ ఎన్నికల ఫలితాల అనంతరం తొలిసారి మీడియా సమావేశంలో మంగళవారం నాడు మమతాబెనర్జీ మాట్లాడుతూ..రాజ్యాంగ వ్యతిరేక వ్యాఖ్యలు చేశారు. రాజీనామా చేయకుంటే బర్తరఫ్ చేస్తారని అసోం

# మమతా బెనర్జీ అహంకారం!



ముఖ్యమంత్రి హిమంతబిశ్వ శర్మ గట్టిగానే హెచ్చరించారు. 15 ఏళ్లపాటు ఇవిఎంలతోనే మమత గెలిచారు. ఇప్పుడేమో ..ఈ ఎన్నికల్లో విలన్‌గా ప్రధాన ఎన్నికల కమిషనర్ వ్యవహరించారు. బెంగాల్‌లో ఈవీఎంలను లూటీచేశారని ఆరోపించడం చూస్తే మతి భ్రమించిందనే అనుకోవాలి. ఉద్దేశ్య పూర్వకంగానే ఒక ప్లాన్ ప్రకారం తనను ఓడించారని, ఎన్నికల కమిషన్‌ను దుర్వినియోగపరిచి బీజేపీ విజయం సాధించిందని, తన జీవితంలో ఎప్పుడూ ఇలాంటి ఎన్నికలు చూడలేదని కూడా చెప్పుకొచ్చారు. కౌంటింగ్ సెంటర్లలో టీఎంసీ కార్యకర్తలను కొట్టారని, తనను 'సీఆర్‌పీఎఫ్ గూండాలు' పొత్తికడుపులో తన్ని కౌంటింగ్ సెంటర్ నుంచి గెంటేశారని తీవ్రారోపణలు చేశారు. ఎస్‌ఐఆర్ నుంచి 90 లక్షల ఓట్లను తొలగించా రనీ, కోర్టుకు వెళ్లడంతో 32 లక్షల ఓట్లు చేర్చారని, టీఎంసీని ఓడించేందుకు అన్నిరకాలుగా ఎత్తుగడలు పన్ని 100 సీట్ల వరకూ బీజేపీ లూటీ చేసిందని విమర్శించారు. నిజానికి గతంలో మమతా బెనర్జీ పకడ్బందీగా ఇవన్నీ చేశారు. మమతను సుప్రీం కూడా చీవాట్లు పెట్టింది. అయినా ఆమెలో మార్పు రాలేదు. ఆమెను 15 ఏళ్లు భరించడమే ఎక్కువ. ఇలాంటి నేతలు ఉన్నందుకు సిగ్గుపడాలి. ఉమ్మడిగా పోరాటం కోసం తాను 'ఇండి' కూటమిలోనే తాను కొనసాగుతానని కూడా స్పష్టం చేశారు. అందుకేనేమో రాహుల్ కూడా ఆమె పట్ల సానుభూతి ప్రకటించారు. కేరళ, తమిళనాడు తప్ప అంతా ఓట్ చోరీ జరిగిందని పాత ఆవుకథను మళ్లీ పదేపదే చెప్పారు. నిజానికి పశ్చిమబెంగాల్, తమిళనాడు, కేరళం రాష్ట్రాల్లో పాలక పార్టీల, కూటములను ప్రజలు ఓడించి మార్పును కోరుకున్నారు. దేశంలో ఎక్కడా ఉనికిని పెంచుకోలేక పోయిన కాంగ్రెస్‌కు కేరళంలో గెలుపు కొత్త ఊరటనిచ్చేదిగా ఉంది. కేరళంలో వరుసగా రెండు తడవలు అసాధారణంగా గెలిచిన వామపక్ష ప్రజాతంత్ర సంఘటన (ఎల్‌డిఎఫ్) ప్రభుత్వం ఓడిపోవడం అన్నది క ఊడా ప్రజలు కోరుకున్న మార్పులో భాగమే. అంతే తప్ప కాంగ్రెస్ మీద ప్రేమతో కాదు. ఇకపోతే తమిళనాడు ఫలితం అనూహ్యం. ప్రముఖ సినీ నటుడు విజయ్ కొత్తగా పెట్టిన టివికె పార్టీకి వందకుపైన సీట్లొచ్చాయి. మరికొందరిని కలుపుకొని ఆయనే కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతున్నారు. మరి ఇక్కడ బిజెపి ఓటు చోరీ చేయలేకనా అన్నది మమతా బెనర్జీ చెప్పాలి. రెండేళ్ల కింద జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో డిఎంకె కూటమి క్లీన్ స్వీప్ చేసింది. అంతలోనే డిఎంకెపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తం కావడానికి రాజకీయ సమీకరణాలు, సామాజిక అంశాలు ప్రముఖంగా పని చేశాయని అర్థమవుతుంది. బిజెపి ఎంతగా పాకులాడినా తమిళనాట ప్రాంతీయ పార్టీలనే ప్రజలు ఆదరించారు. పశ్చిమబెంగాల్‌లో మమత పార్టీ టిఎంసి అవినీతిమయమైంది. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో, శాంతి భద్రతలను పరిరక్షించడంలో ఘోరంగా విఫలమైంది. బంగ్లాదేశ్ నుంచి అక్రమ చొరబాటు అంశాన్ని రాజకీయంగా ఉపయోగపెట్టుకుంది. ఇవన్నీ మరచిన మమత తానేదో పునీతురాలినని చెప్పుకోవడం, సిఎంగా రాజీనామా చేయనని ప్రకటించుకోవడం అహంకారంతో కూడిన అవివేకానికి నిదర్శనం. అలా చేస్తే బర్తరఫ్ చేయడం తప్ప మరోమార్గం ఉండదు.

# కాలం - మనిషికి గురువు, జీవితానికి న్యాయమూర్తి

**కాలం ముందు అందరూ సమానులే రాజు అయినా, రంకు అయినా, తెలివైనవాడు అయినా, అజ్ఞాని అయినా. కాలం తన పరీక్షలో ఏ పక్షపాతమూ చూపదు.మానవ జీవిత ప్రయాణంలో మనం అనేక పరీక్షలను ఎదుర్కొంటాం. పాఠశాల గదుల్లో రాసే పరీక్షలు, కెరీర్ లో ఎదురయ్యే సవాళ్లు, బంధుత్వాల్లోని ఒడిదుడుకులు ఇవన్నీ మన సామర్థ్యాన్ని, సహనాన్ని మారుస్తూ ఉంటాయి. కానీ, వీటన్నింటికీ మించి మనిషిని నిజమైన కోణంలో కొలిచే ఏకైక కొలమానం కాలం . కాలం పెట్టే పరీక్ష కేవలం తెలివితేటల మీద ఆధారపడి ఉండదు.**



అది మనిషిలోని జ్ఞానాన్ని, ధైర్యాన్ని, కరుణను, మరియు నిజాయితీని ఒక్కో పొరను తొలగిస్తూ లోపలి వాస్తవాన్ని బయటకు తీస్తుంది. విద్యా పరీక్షలో ఫెయిలైనా మళ్ళీ ప్రయత్నించవచ్చు, కానీ కాలం పరీక్షలో ఒకసారి నిలబడలేకపోతే, ఆ ముద్ర జీవితకాలం మన వెంటే ఉంటుంది. చరిత్ర పుటలను తిరగేస్తే, కాలమే నిజమైన న్యాయమూర్తి అని స్పష్టంగా అర్థమవుతుంది. ఒకప్పుడు రాజ్యాలను ఏలిన చక్రవర్తులు, ప్రజలను తమ కనుసన్నలతో శాసించిన నియంతలు నేడు ఎక్కడ ఉన్నారు? వారి పేర్లు చరిత్ర పుస్తకాలలో కేవలం అక్షరాలుగా మిగిలిపోయాయి. ఒకవేళ వారి చరిత్ర గుర్తుండిపోయినా, అది వారి అధికారం వల్ల కాదు, వారు చేసిన పనుల వల్ల.అదే సమయంలో, ఎటువంటి గుర్తింపు కోరుకోని నిరాడంబరమైన మహాత్ములు, పేదలకు సేవ చేసిన వారు, జ్ఞానాన్ని పంచిన వారు కాలం గడిచే కొద్దీ వారి విలువ పెరుగుతూనే ఉంది. భారత స్వాతంత్ర్య పోరాటంలో అజ్ఞాతంగా పోరాడిన వేలాది మంది వీరులను కాలం మర్చిపోలేదు. వారు ఏ పురస్కారమూ పొందకపోయినా, వారి త్యాగం ఒక దీపంలా వెలుగుతూనే ఉంది. ఎందుకంటే కాలం అధికారాన్ని కాదు, వ్యక్తిత్వాన్ని మాత్రమే గౌరవిస్తుంది.సుఖసమయాల్లో ప్రతి ఒక్కరూ మంచివారే. నవ్వుతూ పలకరించే ముఖాలు, తోడుగా ఉండే మనుషులు చాలామంది ఉంటారు. కానీ కష్టాలు వచ్చినప్పుడు మాత్రమే మనిషిలోని అసలైన ముఖచిత్రం బయటపడుతుంది. ఆర్థిక సంక్షోభం వచ్చినప్పుడు స్నేహితుడికి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారా? అనారోగ్యంతో ఉన్నప్పుడు మీ పక్కన నిలబడ్డారా? నిరాశ అంధకారంలో మునిగినప్పుడు భరోసా ఇచ్చారా?ఈ ప్రశ్నలకు జీవితం ఒక్కొక్క నాడు సమాధానం చెబుతుంది. అందుకే పెద్దలు చెప్పిన మాట అక్షర సత్యం.కష్టంలో తెలుసు నేస్తం, కాలంలో తెలుసు మనిషి. కాలం అనే అగ్నిలో మనిషి నిజమైన బంగారంలా మెరుస్తాడా, లేక సామాన్యమైన రాయిగా మిగిలిపోతాడా అనేది ఆ కష్ట కాలమే నిర్ణయిస్తుంది. సమస్యలు మనల్ని ఇబ్బంది పెట్టడానికి రావు, మనలోని అసలైన స్వభావాన్ని పరీక్షించడానికి వస్తాయి.నేటి యువతలో చాలామంది తాత్కాలిక విజయాలకు పొంగిపోతుంటారు. సోషల్ మీడియా యుగంలో, ప్రతిదీ ఒక్క రాత్రిలో జరగాలని, తక్కువ కష్టంతో గొప్ప ఫలితాలు దక్కాలని ఆశిస్తున్నారు. కానీ, కాలం వారికి ఒక సత్యాన్ని పదే పదే బోధిస్తుంది సత్వర విజయాలు ఎప్పుడూ తాత్కాలికమే.వేరుశెనగ మొక్క కొన్ని నెలల్లోనే పెరుగుతుంది, కానీ మహావృక్షం దశాబ్దాల కాలం తీసుకుంటుంది. వేగంగా పెరిగింది తుపానుకు తట్టుకోలేదు, కానీ వేళ్లను లోతుగా నాటుకున్న వృక్షం దశాబ్దాలపాటు నిలబడుతుంది. జీవితంలో మనం నిర్మిస్తున్నది ఏమిటి? కేవలం భ్రమల సౌధమా లేక విలువల వృక్షమా? కాలమే దీనికి సమాధానం చెప్పాలి. నిరంతర సాధన, ఓర్పు, మరియు నిజాయితీ మాత్రమే శాశ్వత విజయాన్ని అందించగలవు.కాలం పరీక్షలో నెగ్గాలంటే సహనం అనే ఆయుధం అత్యంత అవసరం. సహనం అంటే బలహీనత కాదు, అది అత్యున్నతమైన శక్తి. ఒక రైతు విత్తనం వేసిన రోజే పంట కోయాలని ప్రయత్నించడు. నీళ్ళు పోసి, కలుపు తీసి, రుతువుల కోసం ఓపికగా వేచి ఉంటాడు. అదే విధంగా, జీవితంలో మనం చేసే శ్రమ ఎల్లప్పుడూ వెంటనే ఫలించకపోవచ్చు.మహాభారతంలోని పాండవులు అడవిలో గడిపిన పన్నెండేళ్ల అజ్ఞాతవాసం ఒక గొప్ప ఉదాహరణ. ఆ సమయంలో వారికి ఓపికే రక్ష, ధర్మమే మార్గం. ఫలితం వచ్చే వరకు నిరీక్షించడం, దారి తప్పకుండా ప్రయత్నించడం ఇదే కాలం పెట్టే పరీక్షలో ఉత్తీర్ణతకు మార్గం. నేటి ఇన్‌స్టంట్ సంస్కృతిలో మనం కోల్పోతున్నది ఇదే. ఒక మంచి పుస్తకాన్ని చదవడానికి, బలమైన స్నేహాన్ని పెంచుకోవడానికి, గొప్ప వ్యక్తిత్వాన్ని నిర్మించుకోవడానికి కాలాన్ని కేటాయించాల్సిందే.జీవితం అంటేనే బాధల, సంతోషాల సమ్మేళనం. ప్రేమించిన వారి వియోగం, అనుకోకుండా వచ్చే ఆర్థిక నష్టం, నమ్మిన వారి వెన్నుపోటు ఇవన్నీ మనసును గాయపరుస్తాయి. అలాంటి సమయంలో కాలం అన్నీ మాన్పుతుంది అని పెద్దలు అంటారు. మొదట్లో ఈ మాటలు వట్టి ఊరటగా అనిపిస్తాయి. కానీ కాలం గడిచేకొద్దీ, ఆ మాటల్లోని లోతు అర్థమవుతుంది.నేటి గాయం రేపు ఒక పాఠం అవుతుంది. నేటి అంధకారం రేపు కొత్త కాంతికి పునాది అవుతుంది. కాలం మనకు ఇచ్చే గొప్ప వరం విస్మృతి మరియు పరిణితి . అయితే, కాలం గడిస్తే చాలు అన్నీ తానే సరిపోతాయని నిష్క్రియగా కూర్చోవడం సరికాదు. ఆ సమయాన్ని సద్వినియోగం చేసుకోవడమే నిజమైన జ్ఞానం. ప్రతి నిమిషం ఒక అవకాశం. మనం ఇప్పుడు చేసే చిన్న చిన్న మంచి పనులు చదవడం, నేర్చుకోవడం, ఇతరులకు సాయం చేయడం ఇవన్నీ కలిసి మన భవిష్యత్తును నిర్ణయిస్తాయి.చివరిగా ఒక ప్రశ్న రాబోయే తరాలకు మనం ఏం అందిస్తున్నాం? మనం సంపాదించే డబ్బు, హోదా, అంతస్తులు వీటన్నింటినీ కాలం చెరిపివేస్తుంది. కానీ మనం జీవించిన తీరు, పంచిన ప్రేమ, నిర్మించిన నైతిక విలువలు ఇవే కాలానికి అతీతంగా నిలుస్తాయి. ఒక చెట్టు నాటితే, ఆ నీడలో మనం కూర్చోకపోవచ్చు. కానీ ఆ చెట్టు నాటిన వ్యక్తి పేరు కాలం గడిచినా చెరగదు.తెలుగులో ఒక గొప్ప సామెత ఉంది. కాలానికి తగినట్లు మెలగాలి, కాలాన్ని అనుసరించి జీవించాలి. దీని అర్థం ప్రవాహంలో కొట్టుకుపోవడం కాదు. కాలాన్ని అర్థం చేసుకుని, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా స్వయాన్ని తీర్చిదిద్దుకుంటూ, నైతిక విలువలను వదులుకోకుండా జీవించడం. అదే అసలైన సంస్కృతి.కాలాన్ని జయించడం అంటే గడియారాన్ని ఆపడం కాదు, లేదా కాలానికి అతీతంగా వెళ్లడం కాదు. నిజార్థంలో కాలాన్ని జయించడం అంటే కాలం మనల్ని పరీక్షించినప్పుడు సగర్వంగా, నిటారుగా నిలబడటం. ఒత్తిడిలో కూలిపోకుండా, నిరాశలో మునిగిపోకుండా, విజయంలో అహంకారానికి లొంగిపోకుండా, స్థిరంగా మానవత్వంతో జీవించడం. అదే కాలం పెట్టే అతిపెద్ద పరీక్షలో నెగ్గడం.చివరగా, ప్రతి పాఠకుడికి నా విన్నపం ,మీ జీవితంలో ఎలాంటి కష్టం వచ్చినా, ఏ గొప్ప విజయం సాధించినా ఒక్క నిమిషం ఆగి ఆలోచించండి. కాలం ఏమి చెబుతుందో వినండి. అది మీకు గురువు, న్యాయమూర్తి, మరియు మిత్రుడు. కాలాన్ని గౌరవిద్దాం. కాలాన్ని ప్రేమించి, సద్వినియోగం చేసుకుందాం. ఎందుకంటే కాలమే పరీక్ష, మన జీవితమే దానికి ఇచ్చే సమాధానం.



డా .సూర్యదేవర రామకృష్ణ ,
9490754169

తెలంగాణ రాజకీయాలంటే ఒకప్పుడు మేధోమథనం, సిద్ధాంత వైరుధ్యం, హుందాతనంతో కూడిన వాదోపవాదాలు. కానీ, దురదృష్టవశాత్తు నేడు ఆ స్థానాన్ని వ్యక్తిగత విద్వేషాలు, జుగుప్సాకరమైన 'చావు' విమర్శలు ఆక్రమిస్తున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మధ్య సాగుతున్న ఈ తాజా వాగ్వివాదం కేవలం రాజకీయ వైరం మాత్రమే కాదు, ఇది రాష్ట్ర రాజకీయ సంస్కృతి ఏ స్థాయికి దిగజారుతోందో ప్రజల కోసం చేసే పోరాటం కావాలి కానీ, ఒకరి చావును మరొకరు కాంక్షించే స్థాయికి దిగజారకూడదు. ముఖ్యమంత్రి అనే వ్యక్తి కేవలం ఒక పార్టీకి నాయకుడు మాత్రమే కాదు, రాష్ట్రంలోని ఐదు కోట్ల మంది ప్రజలకు ప్రాతినిధ్యం వహించే అత్యున్నత పదవిలో ఉన్నవారు. ఆ పదవికి ఒక గౌరవం, హుందాతనం ఉంటాయి. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి కేసీఆర్ కర్త, కర్మ, క్రియ. విభేదాలు ఉండవచ్చు, విమర్శలు చేయవచ్చు.. కానీ

# తెలంగాణలో చావు విమర్శలు

చెప్పే ఒక ప్రమాద సంకేతం.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గడిచిన కొన్ని నెలలుగా కేసీఆర్‌ను ఉద్దేశించి తీవ్రస్థాయిలో వ్యాఖ్యలు చేస్తున్నారు. తాజాగా భూపాలపల్లి సభలో ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీశాయి. "వచ్చే ఎన్నికల్లో నిన్ను జగిత్యాలలో బొందదీసి పాతరేయకపోతే పేరు మార్చుకుంటాను" అని ఆయన చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఒక బాధ్యతాయుతమైన ముఖ్యమంత్రి స్థానంలో ఉండి, ఒక మాజీ ముఖ్యమంత్రిని, పైగా వయసులో పెద్దవారైన వ్యక్తిని ఉద్దేశించి ఇలాంటి భాష వాడటం ఎంతవరకు సమర్థనీయం?ఇన్నాళ్లు రేవంత్ విమర్శలపై మౌనంగా ఉన్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, ఈసారి తనదైన శైలిలో ఘాటుగా స్పందించారు. "నీవు ఎన్ని జన్మలెత్తినా నేను చావను కొడకా.. మీ అక్రమాల అంతు చూసే వరకు బతికే ఉంటా" అంటూ ఆయన ఇచ్చిన రిప్లై తెలంగాణ రాజకీయాలను ఒక్కసారిగా వేడెక్కించింది. తన చావును కోరుకునే వారికి, తన ఉనికిని ప్రశ్నించేవారికి ఇది కేసీఆర్ ఇచ్చిన బలమైన సంకేతంగా ఆయన అనుచరులు భావిస్తున్నారు. అయితే, ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే, ఈ పరస్పర దూషణల్లో ప్రజా సమస్యలు ఎక్కడో అట్టడుగుకు వెళ్ళిపోతున్నాయి.తెలంగాణ సమాజం సహజంగానే సంస్కారవంతమైనది. శత్రువునైనా గౌరవించే సంప్రదాయం ఇక్కడిది. రాజకీయం అంటే ఆయన ఉనికినే దెబ్బతీసేలా మాట్లాడటం సామాన్య ప్రజానీకానికి రుచించడం లేదు.రేవంత్ వ్యాఖ్యలను సమర్థించే కాంగ్రెస్ నేతలు, గతంలో కేసీఆర్ కూడా ఇదే స్థాయిలో "బొంద పెడతాం", "నరికి పొలాల్లో వేస్తాం" వంటి వ్యాఖ్యలు చేశారని గుర్తు చేస్తున్నారు. అయితే, నాడు తెలంగాణ ఉద్యమ కాలం. ప్రజల్లో ఆవేశం నింపాల్సిన అవసరం ఉంది. కానీ నేడు మనం ఒక స్వతంత్ర రాష్ట్రంలో ఉన్నాం. ఇప్పుడు కావలసింది కక్షలు కాదు, అభివృద్ధి. ఒక తప్పును మరొక తప్పుతో సమర్థించడం రాజకీయ అపరిపక్వతకే నిదర్శనం. రాజకీయ నాయకులు తమ కార్యకర్తల్లో ఉత్సాహం నింపడానికి ఇలాంటి ఘాటైన డైలాగులు పేలుస్తుంటారు. కానీ, ఇవి కేడర్‌లో జోష్ నింపుతాయేమో కానీ, తటస్థ ఓటర్లలో మాత్రం ఏహ్యభావాన్ని కలిగిస్తాయి. ప్రజాస్వామ్యం అంటే చర్చల వేదిక కావాలి కానీ, శాపనార్థాల వేదిక కాకూడదు.తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు కావాల్సింది వివేకం. అధికారం ఎప్పుడూ శాశ్వతం కాదు. నాయకులు వాడే భాష, వారు ఇచ్చే గౌరవం భవిష్యత్తు తరాలకు ఆదర్శంగా ఉండాలి. రేవంత్ రెడ్డి ఇకపైనైనా తన భాషా ప్రయోగాన్ని సమీక్షించుకుంటారని, కేసీఆర్ వంటి సీనియర్ నేతలు చర్చను అభివృద్ధి వైపు మళ్ళిస్తారని తెలంగాణ సమాజం ఆశిస్తోంది. చావు రాజకీయాలు మాని, బతుకు దెరువు రాజకీయాలు చేయడమే నేటి అవసరం.

# పైసలు ల్లేకుండానే పదవులు

### ఉత్సవ విగ్రహాలుగా నామినేటెడ్ నేతలు

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెం టనే 37 మందిని చైర్మన్లుగా నామినేటెడ్ పదవుల్లో భర్తీచేసింది. ఆ తర్వాత మరో ఐదారుగు రిని ప్రభుత్వం నియమించింది. ఇంకా భర్తీచేయని నామినేటెడ్ పోస్టులు 30కి పైగానే ఉన్నాయి. అయితే మొదటి విడతలో భర్తీచేసిన వాటిలో కీలకమైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనా ర్టీ, మహిళా, దివ్యాంగులతో పాటు వివిధ కులాల కార్పోరేషన్లు కూడా ఉన్నాయి.మొదటగా భర్తీచేసిన చైర్మన్ల పదవీ కాలం జూలై రెండోవారంలో ముగుస్తుంది. అయితే వీరి పదవీ కాలంలో ఏ ఒక్కరికి కూడా కార్పోరేషన్ల ద్వారా నిధులు ఇవ్వలేదు. దాంతో కార్పోరేష న్ల ద్వారా సాయం చేయలేని పరిస్థితి నెలకొన్నది. ఆయా కార్పోరేషన్ల చైర్మన్లకు రుణాలు ఇప్పించాలని నిత్యం ఒత్తిడి ఉన్నా.. చైర్మన్లు చేసేదేమీలేక మిన్నకుండిపోతున్నారు.పార్టీ ఇచ్చిన కార్యక్రమాలు, సమావేశాలకు వెళ్లడం తప్ప.. ప్రభుత్వపరంగా నిరుద్యోగ యువతకు, నమ్ముకున్న కేడర్‌కు న్యాయంచేయలేని పరిస్థితి వారిది. పదవీకాలం ముగియనుండటం తో తమకు మరోసారి అవకాశం కల్పించాలని ప్రభుత్వ పెద్దలకు విజ్ఞప్తి చేస్తున్నట్లుగా తెలుస్తున్నది. రాష్ట్రంలోని వివిధ కార్పోరేషన్ల ద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించలేని దుస్థితి నెలకొన్నది. నిధుల లేమితో గతేడాది అట్టహాసంగా ప్రారంభించిన యువ వికాసం పథకం అటకెక్కింది. ఈ పథకం కోసం లక్షలాది మంది దరఖాస్తులు చేసుకున్నారు. అయితే సర్కార్ నిధులు విడుదల చేయకపోడంతో నిరుద్యోగ యువత ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఇక ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, పిషర్మెన్, వికలాంగులతో పాటు వివిధ కులాల ఫెడరేషన్లు, కార్పోరేషన్లలో.. యువతకు ఉమ్మడి రాష్ట్రం లో ప్రతి ఏటా సబ్సిడీ ద్వారా ప్రభుత్వం రుణాలు ఇవ్వడం జరుగుతుండేది.





## ఇకపై తన పాత్రల విషయంలో జాగ్రత్తగా ఉంటానన్న రాశి

ఒకప్పుడు తెలుగు తెరపై వెలిగిపోయిన హీరోయిన్ రాశి, ప్రస్తుతం క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా సెకండ్ ఇన్నింగ్స్‌లో బిజీగా ఉన్నారు. తిరువీర్ హీరోగా నటించిన 'పాపం ప్రతాప్' సినిమా నిన్న (శుక్రవారం) విడుదలై మంచి ఆదరణ పొందుతున్న తరుణంలో, ఈ చిత్ర సక్సెస్ మీట్‌లో రాశి తన సినీ ప్రస్థానంపై కీలక వ్యాఖ్యలు చేశారు. ముఖ్యంగా మహేశ్ బాబు హీరోగా వచ్చిన 'నిజం' సినిమాలో తాను చేసిన నెగెటివ్ షేడ్ ఉన్న పాత్ర గురించి ప్రస్తావిస్తూ.. "ఆ రోల్ అంత నెగెటివ్‌గా మారుతుందని నేను అస్సలు ఊహించలేదు" అని పేర్కొన్నారు. కేవలం ఒక నటిగా అన్ని రకాల షేడ్స్ చేయాలనే ఉద్దేశంతోనే ఆ సినిమాలో నటించానని చెప్పారు.ఇకపై తాను చేసే పాత్రల విషయంలో చాలా స్పష్టంగా ఉంటానని రాశి తెలిపారు. "'పాపం ప్రతాప్' దర్శకుడు నా కోసమే ఈ పాత్ర రాశానని చెప్పారు. పాత్రలో దమ్ముండి, అది ప్రేక్షకులకు నచ్చుతుంది అనుకుంటేనే గ్రీన్ సిగ్నల్ ఇస్తాను. అది పాజిటివా, నెగెటివా అన్నది నాకు ముఖ్యం కాదు" అని ఆమె వివరించారు. గోపీచంద్ విలన్‌గా మెరిసిన 'నిజం'లో రాశి చేసిన బోల్డ్, నెగెటివ్ పాత్ర అప్పట్లో పెద్ద సంచలనమే సృష్టించింది. మళ్ళీ ఇన్నేళ్ల తర్వాత ఆమె ఒక మంచి హిట్ మూవీతో ప్రేక్షకులను పలకరించడం విశేషం.

## 'జైలర్-2' ఓటీటీ డీల్ 160కోట్లు?



సూపర్‌స్టార్ రజనీకాంత్ ప్రస్తుతం 'జైలర్-2' షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని జూన్‌లో రిలీజ్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. 'జైలర్' బాక్సాఫీస్ బ్లాక్‌బస్టర్‌గా నిలవడంతో ఈ సీక్వెల్‌పై మరింతగా అంచనాలు ఏర్పడ్డాయి. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమా ఓటీటీ హక్కులను అమెజాన్ ప్రైమ్ వీడియో సంస్థ 160కోట్లకు కొనుగోలు చేసిందని తెలిసింది. ఇది ఇప్పటివరకు తమిళ సినిమా ఓటీటీ హక్కుల విషయంలో రికార్డని, రజనీకాంత్ సినిమాల్లో కూడా అత్యధికమని చెన్నై సినీ వర్గాలంటున్నాయి. చిత్ర నిర్మాణ సంస్థ సన్‌పిక్చర్స్‌తో ఇటీవలే అమెజాన్ ప్రైమ్ ఈ ఒప్పందాన్ని ఖరారు చేసుకుందని సమాచారం. 'జైలర్' తొలిభాగం దాదాపు 600కోట్లు వసూలు చేసింది. ఈ నేపథ్యంలో సీక్వెల్ బాక్సాఫీస్ పర్‌ఫార్మెన్స్‌పై ట్రేడ్ వర్గాలు నమ్మకంగా ఉన్నాయి. ఈ క్రేజ్ కారణంగానే అమెజాన్ ప్రైమ్ భారీ మొత్తానికి డిజిటల్ హక్కుల్ని కొనుగోలు చేసిందని అంటున్నారు. ఎస్‌జే సూర్య, రమ్యకృష్ణ, యోగిబాబు తదితరులు ప్రధాన పాత్రల్ని పోషిస్తున్న ఈ చిత్రంలో మోహన్‌లాల్, శివరాజ్‌కుమార్, విజయ్ సేతుపతి అతిథి పాత్రల్లో కనిపించనున్నారు.

## ప్రాజెక్టులతో రాశీ ఖన్నా ఫుల్ బిజీ!

తెలుగులో స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకున్న నటి రాశీ ఖన్నా, ప్రస్తుతం బాలీవుడ్‌లోనూ వరుస అవకాశాలతో దూసుకెళ్తున్నారు. దక్షిణాదిలో విజయవంతమైన కెరీర్‌ను కొనసాగిస్తూనే, హిందీలోనూ చేతి నిండా క్రేజీ ప్రాజెక్టులతో బిజీగా మారారు. ప్రస్తుతం ఆమె ప్రముఖ దర్శకుడు అనీస్ బాజ్మీ తెరకెక్కిస్తున్న ఓ చిత్రంలో నటిస్తున్నారు. ఈ సినిమాలో అక్షయ్ కుమార్, విద్యా బాలన్ ప్రధాన పాత్రలు పోషిస్తుండగా, రాశీ ఖన్నా కీలక పాత్రలో కనిపించనున్నారు. తాజాగా ఈ సినిమా షూటింగ్ సెట్లోని సరదా క్షణాలను ఆమె సోషల్ మీడియాలో పంచుకున్నారు. సహనటి విద్యా బాలన్ తనకు ప్రేమగా ఓ బాక్స్ డోనట్స్ బహుమతిగా ఇచ్చారని, ఆ ఫొటోలను షేర్ చేశారు. "ఈ డోనట్స్ అందించిన స్వీటెస్ట్ విద్యా బాలన్ మ్యామ్‌కు థ్యాంక్స్" అంటూ తన పోస్టులో రాశీ పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, రాశీ ఖన్నా నటించిన 'లుక్కే' అనే వెబ్ సిరీస్ మే 8న అమెజాన్ ప్రైమ్ వీడియోలో విడుదల కానుంది. 8 ఎపిసోడ్ల ఈ మ్యూజికల్ యాక్షన్ డ్రామా సిరీస్‌లో ఆమె ప్రధాన పాత్ర పోషించారు. వీటితో పాటు షాహిద్ కపూర్, విజయ్ సేతుపతిలతో కలిసి 'ఫర్జీ' సీజన్ 2లో, విక్రాంత్ మాస్సేతో 'తలాఖో మే ఏక్', ఆర్. మాధవన్‌తో 'బ్రిడ్జ్' వంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులు కూడా రాశీ చేతిలో ఉన్నాయి.


'పుష్ప' ఫ్రాంఛైజీ, 'యానిమల్' 'ఛావా' చిత్రాలతో జాతీయ స్థాయిలో పేరుప్రఖ్యాతుల్ని సంపాదించుకుంది అగ్ర నాయిక రష్మిక మందన్న. తాజాగా ఆమె 'మైసా' చిత్రంతో కెరీర్‌లోనే ఓ ఛాలెంజింగ్ రోల్‌ని పోషిస్తున్నది. ఈ యాక్షన్ థ్రిల్లర్‌కు రవీంద్ర పుల్లె దర్శకత్వం వహిస్తున్నారు. ఇందులో గిరిజన తెగకు చెందిన గోండ్ మహిళగా కనిపించనుంది రష్మిక మందన్న. ఇప్పటికే విడుదల చేసిన ప్రచార చిత్రాలు సినిమాపై అంచనాల్ని పెంచాయి. ఈ సినిమాలోని యాక్షన్ ఘట్టాల కోసం రష్మిక మందన్న ప్రతిరోజూ 8 గంటల కఠోర శిక్షణ తీసుకుంటున్నది. అంతర్జాతీయ యాక్షన్ డైరెక్టర్ ఆండిలాంగ్ పర్యవేక్షణలో

## 'మైసా' కోసం కసరత్తులు

బ్యాంకాక్‌లో ఈ ట్రెయినింగ్ జరుగుతున్నది. 'మైసా' కథ విన్న తర్వాత పాత్ర కోసం తాను శారీరకంగా, మానసికంగా మరింత దృఢంగా కనిపించాలని రష్మిక నిర్ణయించుకుందని, యాక్షన్ ఘట్టాలన్నీ సహజంగా కనిపించాలనే లక్ష్యంతో బ్యాంకాక్‌లో స్టంట్స్, కంబాట్ ట్రెయినింగ్ తీసుకుంటున్నదని మేకర్స్ తెలిపారు. శనివారం ఇందుకు సంబంధించిన పోస్టర్స్‌ను విడుదల చేశారు. త్వరలో కేరళలో 16రోజుల పాటు జరిగే కీలక యాక్షన్ షెడ్యూల్ కోసం రష్మిక మందన్న ఈ శిక్షణ తీసుకుంటున్నది. ఈ చిత్రానికి సంగీతం: జేక్స్ బిజోయ్, నిర్మాతలు: అన్‌ఫార్ములా ఫిల్మ్స్, రచన-దర్శకత్వం: రవీంద్ర పుల్లె.



## ఆధ్యాత్మిక కలయిక.. 'వాల్మీకి రామాయణం' కోసం జతకట్టిన ఇళయరాజా!




భారతీయ సంగీత శిఖరం, మాస్ట్రో ఇళయరాజా మరో అద్భుతమైన ఆధ్యాత్మిక ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. బాలీవుడ్ నుంచి ప్రతిష్టాత్మక 'వాల్మీకి రామాయణం' రాబోతుండగా ఈ చిత్రానికి ఆయన సంగీతం అందించబోతున్నాడు. ఈ విషయాన్ని తెలియజేస్తూ, ఇదొక ఆధ్యాత్మిక కలయిక.. సంగీతం ఇప్పుడు ఒక నైవేద్యం అంటూ చిత్ర బృందం సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది.

## ఓరుగల్లు నుంచి స్వరప్రయాణం



సుమంత్ ప్రభాస్ హీరోగా నటిస్తున్న గ్రామీణ ప్రేమకథ 'గోదారి గట్టుపైన' చిత్రం ద్వారా సంగీత దర్శకుడిగా పరిచయమవుతున్నారు నాగవంశీ. సుభాష్‌చంద్ర దర్శకత్వం వహించిన ఈ సినిమా మే 8న విడుదలకానుంది. ఈ సినిమా గీతాలకు మంచి స్పందన లభిస్తున్నది. ఈ సందర్భంగా శనివారం చిత్ర సంగీత దర్శకుడు నాగవంశీ విలేకరులతో ముచ్చటించారు. 'మా స్వస్థలం హన్మకొండ. నాన్న సంగీతకారుడు. ఫ్లూట్, కీబోర్డ్ ప్లే చేస్తారు. మాకు సొంతంగా ఓ స్టూడియో కూడా ఉంది. నాన్న దగ్గరే కీ బోర్డ్ నేర్చుకున్నాను. షార్ట్‌ఫిల్మ్స్‌కి మ్యూజిక్ చేస్తున్నప్పుడు దర్శకుడు సుభాష్‌చంద్రతో పరిచయం ఏర్పడింది. అలా 'గోదారి గట్టుపైన' సినిమాకు అవకాశం దక్కింది' అన్నారు. కథానుగుణంగా సంగీత ప్రాధాన్యం ఉన్న చిత్రమిదని, ఓ రెట్రోసాంగ్‌ను సీనియర్ సింగర్స్ చిత్ర, యస్పీ చరణ్ ఆలపించారని, తాను కంపోజ్ చేసిన ట్యూన్‌ను వారు ప్రశంసించారని నాగవంశీ చెప్పారు. మొత్తం ఏడు పాటల్లో వేటికవే ప్రత్యేకంగా ఉంటాయని, స్వతహాగా తనకు మెలోడీస్ అంటే ఇష్టమని, స్వరరచనలో అదే తన బలమని తెలిపారు. 'ఇళయరాజా, రెహమాన్, మణిశర్మ, హారిస్ జైరాజ్‌లను స్ఫూర్తిగా తీసుకొని సంగీత ప్రయాణాన్ని ప్రారంభించాను. 'గోదారి గట్టుపైన' చిత్రం మంచి గుర్తింపును తీసుకొస్తుందనే నమ్మకం ఉంది'

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G
Owned by Makam Gangadhar and Printed at Ratna Graphics, H.No. 2-3-703/7, Thirumala Nagar Colony, Opp: Amberpet Police Line, Hyderabad - 500 013T.G.
H.No. 11-5-565, Bhagya Lakshmi Towers, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.G. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. TGTEL/2025/A0121.